సోమవారం
26-06-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 05
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అక్షరాక్షరం అభ్యుదయం

వెనక్కి తగ్గిన వాగ్నర్ సేన

రష్యా, వాగ్నర్ సేనల మధ్య సయోధ్య కుదిరింది. సాయుధ తిరుగుబాటుకు తెరపడింది. కీలక నగరాలు రోస్తోవ్, ఓరోజెన్‌లను స్వాధీనం చేసుకున్న తిరుగుబాటు వాగ్నర్ సేనలు మాస్కో దిశగా సాగుతున్న ప్రయాణాన్ని నిలిపివేస్తున్నట్టు ఆ దళాధిపతి యెవ్‌జెనీ ప్రిగోజిన్ ప్రకటించారు. రష్యన్ల రక్తపాతాన్ని నివారించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.

2 లో

టాలీవుడ్‌ను కుదిపేస్తున్న 'డ్రగ్స్'

కేపీ చౌదరి అరెస్టుతో కదులుతున్న డొంక

సినీ తారలకు సంబంధం?

హైదరాబాద్: టాలీవుడ్ ని మరోసారి డ్రగ్స్ అంశం కుదిపేస్తోంది. నిర్మాత కేపీ చౌదరి డ్రగ్స్ కేసులో అరెస్ట్ కావడంతో అతడి నుంచి పోలీసులు మరింత సమాచారం రాబడుతున్నారు. ఇందులో ఇంకా ఎవరెవరు ఉన్నారో తెలుసుకునేందుకు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో కొంతమంది సినీతారలు, వ్యాపారవేత్తల పేర్లు బయటకి వస్తున్నాయి. అషురెడ్డి, సురేఖ వాణి, ఆమె కుమార్తె సుప్రీత, నటి జ్యోతి లాంటి వారి ఫోన్ నంబర్లు కేపీ చౌదరి కాల్ లిస్ట్ లో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. దీనితో ఆ కోణంలో దర్యాప్తు

- మిగతా 2 లో

విపక్షాల ఐక్యతకు

ఢోకా లేదు

- పార్టీల మధ్య అభిప్రాయ భేదాలతో కూటమికి ఆటంకం కలగదు
- 'సారథి' ఎవరన్న చర్చ ఇప్పుడు ముఖ్యం కాదు
- బీజేపీకి ఎన్నికల భయం ...అందుకే అసంబద్ధ వ్యాఖ్యలు, విమర్శలు
- పీటీఐ ఇంటర్వ్యూలో సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా

2 లో



'ఐ ప్యాడ్' టెన్షన్

- ఎమ్మెల్యేలపై నిఘా
- వెంటాడుతున్న పీకే టీమ్
- జగన్‌కు నివేదికల పర్వం
- సీనియర్ల తిరుగుబావుటా
- పక్క పార్టీలపై చూపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ ఎమ్మెల్యేల్లో 'ఐపాడ్ టీమ్ టెన్షన్' మొదలైంది. పార్టీ అధినేత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పూర్తిగా ఐప్యాడ్ టీమునే నమ్ముకుని కార్యకలాపాలు కొనసాగించడం ఎమ్మెల్యేలకు నచ్చడం లేదు. సీఎం విధానాల్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇటీవల తాడేపల్లిలో నియోజకవర్గ, ప్రాంతీయ సమన్వయకర్తలు, ఎమ్మెల్యేలతో జరిగిన సమీక్షలో పార్టీ అధినేత, సీఎం జగన్ 18 మంది ఎమ్మెల్యేల పనితీరు బాగోలేదంటూ హెచ్చరించారు. సెప్టెంబరులోగా వారి పనితీరు మెరుగుపర్చుకోకుంటే, వచ్చే ఎన్నికల్లో టికెట్లు ఇచ్చేది లేదంటూ సీఎం తెగేసి చెప్పారు. వారి పేర్లను వెల్లడించడం ఇక్కడ సరికాదనీ, హైదరాబాదులోని ఐపాడ్ టీమ్ వద్దకు వెళ్లి సంప్రదించాలంటూ, సాక్షాత్తూ పార్టీ అధినేత ఆదేశించడంపై సొంత పార్టీ ఎమ్మెల్యేలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏమన్నా ఉంటే పార్టీ అధినేత... ఎమ్మెల్యేలను పిలిచి దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించాలి లేదా ముఖ్య నేతల్ని పిలిపించి వారిలో ఉన్న లోపాల్ని అధిగమించేందుకు దిశా నిర్దేశం చేయించేలేగానీ, ఇలా ఐపాడ్ టీములను నమ్ముకుని కార్యకలాపాలను

- మిగతా 2 లో

పోలవరం ఇంకెన్నాళ్లు?

- కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల నిర్లక్ష్యం
- నత్త నడకన ప్రాజెక్టు పనులు
- ఆది నుంచి చిన్న చూపే
- నేడు పోలవరంలో సీపీఐ అధ్వర్యంలో బహిరంగ సభ

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: ఆంధ్రుల జీవనాడి పోలవరం ప్రాజెక్టు కల సాకారమయ్యేదెన్నడో అంతు పట్టడంలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరి వల్లే పోలవరం ప్రాజెక్టు నిర్మాణం నత్తనడకన సాగుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిర్వాసితుల నష్టపరిహారం, పునరావసకాలనీలు, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కి నిధుల కేటాయింపులో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత అవశేషాంధ్రలో ఏర్పడిన తొలి టీడీపీ ప్రభుత్వం పోలవరం పనులను నిర్వహిస్తే తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ పేరుతో పోలవరం ప్రాజెక్టుని చావు దెబ్బతీసి తెలుగు ప్రజల చిరకాల స్వప్నానికి గండి కొట్టింది. ఎంతెంత దూరం.. ఆమడ దూరం, ఇంకెంత దూరం.. చానా చానా దూరం అనేది గ్రామీణ ప్రాంతాలలో పిల్లలు ఆడుకునే ఆట. పోలవరం ఎప్పుడు పూర్తి అవుతుంది? ఇంకెంత దూరం..? అన్న ప్రశ్నలకు పిల్లల ఆటే సమాధానంగా మారింది. విభజన సందర్భంగా ఏపీకి కేంద్రం ఇచ్చిన వరాలలో చెప్పుకోదగినది పోలవరం ప్రాజెక్టు మాత్రమే. తెలుగుదేశం ప్రభుత్వం అవరోధాలు, అడ్డంకులు, అనుమతుల్ని పరిష్కరించుకుంటూ ఐదేళ్లలో సుమారు రూ.11,537 కోట్లు ఖర్చుపెట్టి 71 శాతం పనులు పూర్తి చేసింది. మొదటి గేటు పెట్టే స్థాయికి ప్రాజెక్టును తీసుకువచ్చింది.నాడు ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్ పోలవరం నిర్మాణంపై అరసత్వం, అవినీతి అంటూ ఎన్నో విమర్శలు చేస్తూ రైతులకు, నిర్వాసితులకు అనేక వరాలు

- మిగతా 2 లో

జర్నలిస్టు ఉద్యమ నేత అంబటి ఆంజనేయులు కన్నుమూత

విశాలాంధ్ర-విజయవాడ: జర్నలిస్టు ఉద్యమనేత, ఐజేయూ స్టీరింగ్ కమిటీ సభ్యులు, ఏపీయూడబ్ల్యూజే గౌరవ సలహాదారులు అంబటి ఆంజనేయులు (78)ఆదివారం రాత్రి 8.50 గంటలకు కన్నుమూశారు. హృద్రోగ సమస్యతో గత వారం రోజులుగా ఆయన బాధపడుతున్నారు. గత మూడురోజులుగా విజయవాడలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రితుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా సుదీర్ఘ కాలంపాటు సేవలు అందించి రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో ఏపీయూడబ్ల్యూజే విస్తరణకు ఆయన విశేష కృషి చేశారు. అంబటి తన జీవితంలో ప్రతి క్షణం యూనియన్ పటిష్టతకే అంకితం చేశారు. ఆయన ప్రస్తుతం ఇండియన్ జర్నలిస్టు యూనియన్ (ఐజేయూ)స్టీరింగ్ కమిటీ సభ్యుడిగా ఉన్నారు. ఆయన ఆంధ్రప్రభ, ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో ప్లాంట్ లెవల్ యూనియన్ అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. ఆంధ్రప్రదేశ్ న్యూస్ పేపర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఏపీఎన్ఈఎఫ్) అధ్యక్షులుగా వివిధ పత్రికలలో ఎంప్లాయిస్ యూనియన్ ఏర్పాటుకు కృషి చేసి నాన్

- మిగతా 2 లో

దళితులను సాంఘికంగా బహిష్కరించిన పెత్తందారులపై చర్యలు తీసుకోవాలి

- శాంతిభద్రతలను పునరుద్ధరించాలి
- తిరుమలాయపాలెం ఘటనపై వామపక్షాల డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తూర్పు గోదావరి జిల్లా, గోకవరం మండలం, తిరుమలాయపాలెంలో దళితులపై పెత్తందారుల అరాచకాలను పది వామపక్ష పార్టీలు తీవ్రంగా ఖండించాయి. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని దళితులపై దాడికి పాల్పడిన పెత్తందారులపై, వారికి కొమ్ము కాస్తున్న పోలీసులపై చర్యలు తీసుకోవాలని ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశాయి. తొలగించిన అంబేద్కర్ విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయాలన్నాయి. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడాన్నీ సహించలేని స్థితిలో ఉండటమంటే రాష్ట్రంలో కులవివక్ష తీవ్రత అర్థమవుతుందని ఆవేదన వ్యక్తం చేశాయి. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని దళితులపై దాడులకు పాల్పడిన వారిపై, సాంఘిక బహిష్కరణ విధించి వేధిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, దళితులకు అండగా నిలబడాలని వామపక్షాలు డిమాండ్ చేశాయి. 'తిరుమలాయపాలెంలోని ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని కొందరు పెత్తందారులు తొలగించడమే కాకుండా దళితులపై దాడులకు తెగబడ్డారు. తిండి, నీరు, మందులు, కనీస అవసరాలు అందకుండా సాంఘిక బహిష్కరణ చేశారు. వారికి వస్తువులు అమ్మితే జరిమానా విధిస్తామని దుకాణాలకు ఆదేశాలు జారీ చేశారు. నిత్యావసరాలు

- మిగతా 2 లో

వెనక్కి తగ్గిన వాగ్నర్ సేన

ఫలించిన బెలారస్ మధ్యవర్తిత్వం

రష్యన్ల రక్తపాతాన్ని నివారించేందుకే: ప్రిగోజిన్ ప్రకటన

అభియోగాల ఎత్తివేతకు పుతిన్ ప్రభుత్వం అంగీకారం

మాస్కో: రష్యా, వాగ్నర్ సేనల మధ్య సయోధ్య కుదిరింది. సాయుధ తిరుగుబాటుకు తెరపడింది. కీలక నగరాలు రోస్తోవ్, ఓరోజెన్‌లను స్వాధీనం చేసుకున్న తిరుగుబాటు వాగ్నర్ సేనలు మాస్కో దిశగా సాగుతున్న ప్రయాణాన్ని నిలిపివేస్తున్నట్టు ఆ దళాధిపతి యెవ్‌జెనీ ప్రిగోజిన్ ప్రకటించారు. రష్యన్ల రక్తపాతాన్ని నివారించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఉక్రెయిన్‌లోని యుద్ధ క్షేత్రాలకు తిరిగెళుతున్నట్టు వెల్లడించారు. ప్రిగోజిన్, రష్యా మధ్య సయోధ్యకు బెలారస్ అధ్యక్షుడు అలెగ్జాండర్ లుకాషెంకో మధ్యవర్తిత్వం వహించినట్టు ఆ దేశం ప్రకటించింది. ఈ మేరకు అధ్యక్ష కార్యాలయం ప్రకటన చేసింది. అయితే రష్యాతో కుదిరిన ఒప్పందం ప్రకారం ప్రిగోజిన్‌పై ఉన్న ఆరోపణలను ఎత్తివేయడానికి పుతిన్ అంగీకరించారని క్రెమ్లిన్ ధ్రువీకరించింది. 'బెలారస్ అధ్యక్షుడు తనకు అందుబాటులో ఉన్న మార్గాల ద్వారా పరిస్థితిని చక్కదిద్దారు.. రష్యా అధ్యక్షుడు పుతిన్ సమన్వయంతో వాగ్నర్ గ్రూప్ చీఫ్ యెవ్‌జెనీ ప్రిగోజిన్‌తో చర్చలు జరిపారు' అని బెలారస్ అధ్యక్ష భవనం ఓ ప్రకటనలో తెలిపింది. చర్చలు ఒక రోజంతా కొనసాగాయి. ఫలితంగా, రష్యా భూభాగంలో రక్తపాతాన్ని నివారించాలని ఒక ఒప్పందానికి వచ్చారు. రష్యాపై వాగ్నర్ సాయుధ తిరుగుబాటును ఆపడానికి, ఉద్రిక్తతలు తగ్గించడానికి తదుపరి చర్యలు తీసుకోవాలన్న అధ్యక్షుడు అలెగ్జాండర్ లుకాషెంకో చేసిన ప్రతిపాదనకు ప్రిగోజిన్ అంగీకరించారని పేర్కొంది. సయోధ్య కుదిరిన క్రమంలో తిరుగుబాటును విరమించిన ప్రిగోజిన్ బెలారస్‌కు వెళ్లిపోతున్నట్టు ప్రకటించారు. తమ సైన్యాలు యుద్ధ భూమికి వెళతాయని వెల్లడించారు. వాగ్నర్ గ్రూప్‌పై అన్ని క్రిమినల్ చర్యలను ఎత్తివేస్తున్నట్టు పుతిన్ యంత్రాంగం తెలిపింది. ప్రిగోజిన్ రోస్తోవ్ నగరాన్ని వీడారని, బెలాసర్ వెళ్లిపోతున్నారని, ఇందుకు సంబంధించి మిలిటరీ హెడ్ క్వార్టర్స్ నుంచి వాహనంలో వెళ్లినట్లు రాయిటర్స్ తెలిపింది. ప్రిగోజిన్ రష్యా నుంచి బెలారస్‌కు వెళ్లిపోతున్నారని, రక్తపాతాన్ని నివారించడానికి ఆయనతో పాటు వాగర్ దళాల మీద ఉన్న అభియోగాలన్నింటినీ అధికారులు ఉపసంహరించుకున్నారని రష్యా ప్రభుత్వ మీడియా ప్రకటించింది. ప్రిగోజిన్‌పై రష్యన్ ఫెడరల్ సెక్యూరిటీ సర్వీస్ (ఎఫ్ఎస్బీ) పెట్టిన క్రిమినల్ కేసును కొట్టివేస్తున్నట్లు తెలిపింది.

కాగా, పుతిన్, ప్రిగోజిన్ మధ్య మూడు దశాబ్దాల అనుబంధముంది. 90వ దశకంలో చిన్న రెస్టారెంట్ యజమానిగా ఉన్న ప్రిగోజిన్‌కు పుతిన్‌తో పరిచయం ఏర్పడింది. పుతిన్ ఆయనను పెంచి పోషించి, ప్రైవేటు సైన్యాధిపతిని చేశారు. ఉక్రెయిన్‌పై యుద్ధంలో కీలకంగా వ్యవహరించిన వాగ్నర్ గ్రూపుకు రష్యాకు మధ్య ఆధిపత్య పోరు మొదలైంది. ఆ సాయుధ దళం తిరుగుబాటు చేయడంతో పుతిన్‌కు ఊహించని ఎదురు దెబ్బ తగిలింది. సుమారు 36 గంటల పాటు పుతిన్‌కు కంటిమీద కునుకు లేకుండా పోయింది. ఉక్రెయిన్‌పై యుద్ధంలో ఈ ప్రైవేటు దళం రంగప్రవేశం తర్వాత రష్యా కొన్ని విజయాలను దక్కించుకుంది. ఈ విజయాల ఘనత ఎవరికి దక్కాలన్న విషయంలో రష్యా సైన్యం, వాగ్నర్ గ్రూప్ మధ్య ఆధిపత్య పోరు మొదలైంది. జనవరిలో డొనెట్స్క్‌లో సొలెడార్ ప్రాంతాన్ని వాగ్నర్ సైన్యం ఆక్రమించిచగా ఇది తమ ఘనతగా రష్యా సైన్యం ప్రకటించుకోవడం ప్రిగోజిన్‌కు ఆగ్రహానికి కారణమైంది. ప్రాణాలకు తెగించి పోరాడుతున్న తమ సైనికులకు ఆయుధాలు అందజేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోందని,

ఇందుకు రక్షణ మంత్రి సెర్గీ షోయిగునే కారణమని ప్రిగోజిన్ దుయ్యబట్టారు. యుద్ధంలో చనిపోయిన తన అనుచరుల మృతదేహాల పక్కనే నిలబడి రష్యా రక్షణమంత్రిపై విమర్శలు చేస్తూ ప్రిగోజిన్ వీడియోలను విడుదల చేశారు. దేశం కోసం పోరాటం చేస్తున్న తమను అంతం చేయడానికి షోయిగు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఇదే సమయంలో ప్రైవేటు సైన్యాలను నియంత్రించేందుకు మాస్కో తీసుకొచ్చిన కొత్త చట్టం కూడా దీనికి ఆజ్యం పోసింది. ఈ చట్ట ప్రకారం రష్యా సైన్యంతో కలిసి స్వచ్ఛందంగా పోరాటం చేస్తున్న ప్రైవేటు సైన్యాలన్నీ రక్షణ శాఖ పరిధిలోకి వస్తాయి. ఈ మేరకు ఒప్పందాలపై సంతకం చేయాలని రష్యా రక్షణ మంత్రి షోయిగు ఉత్తర్వులు జారీ చేయడం ప్రిగోజిన్‌కు మరింత ఆగ్రహం తెప్పించాయి. సైనిక వ్యూహాలనే సరిగా అమలు చేయలేని వ్యక్తి చెబుతున్న ఒప్పందాలపై సంతకం చేయమని ఆయన చెప్పారు. సొంత భూభాగాన్ని కూడా రష్యా సైన్యం కాపాడుకోలేదని విమర్శించారు. గత నెలలో బఖ్‌ముత్‌ను స్వాధీనం చేసుకున్న సమయంలో ఈ విభేదాలు మరింత ముదిరాయి. ఇలా పెరిగిన అవిశ్వాసం, అనుమానాలే తిరుగుబాటుకు దారితీశాయి.

రష్యాకు క్యూబా, ఇరాన్, వెనిజులా, నికరాగ్వా సంఘీభావం

రష్యాపై సాయుధ తిరుగుబాటు క్రమంలో ఆ దేశానికి క్యూబా, వెనిజులా, నికరాగ్వా, ఇరాన్ సంఘీభావం ప్రకటించాయి. వాగ్నర్ గ్రూపు ప్రైవేటు సైన్యం తిరుగుబాటు క్రమంలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, రష్యా ప్రజలకు సంఘీభావాన్ని క్యూబా ప్రభుత్వం, ప్రజల తరపున ఆ దేశాధ్యక్షుడు మిగుల్ డియాజ్ ప్రకటించారు. మరలా సాధారణ పరిస్థితులు నెలకొంటాయని ఆకాంక్షిస్తూ శనివారం ట్వీట్ చేశారు. ఇరాన్ విదేశాంగ మంత్రి హుస్సేన్ ఫోన్ చేసి రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్‌తో మాట్లాడారు. రాజ్యాంగ విరుద్ధ చర్యలకు వ్యతిరేకిస్తున్నామని, రష్యా యంత్రాంగానికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు వెల్లడించారు. వెనిజులా, నికరాగ్వా అధ్యక్షులు నికోలస్ మదురో, డేనియల్ ఒర్టెగా కూడా రష్యాకు మద్దతు ప్రకటించారు. తిరుగుబాటును ఖండించారు. రాజ్యాంగ విరుద్ధ మార్గాల ద్వారా అధికార మార్పు లేదా సాయుధ తిరుగుబాటును తిరస్కరిస్తామని వెనిజులా ప్రకటన చేసింది. రష్యా సార్వభౌమాధికారం, స్వయంప్రతిపత్తిపై దాడిని ఖండిస్తున్నట్లు పేర్కొంది. శాంతి, సుస్థిరత, ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా జరిగిన ఈ దాడిని ఎదుర్కొనేందుకు రష్యా ప్రజలకు రెండు దేశాల అధ్యక్షులు వేర్వేరుగా సంఘీభావం ప్రకటించారు. ప్రస్తుత పరిస్థితులు రష్యా ప్రతిష్ట, స్వభావం, బలానికి సవాళ్లని నికరాగ్వా అధ్యక్షుడు పేర్కొన్నారు.

'ఐ ప్యాడ్' టెన్షన్

(మొదటిపేజీ తరువాయి)

కొనసాగించడాన్ని తప్పుపడుతున్నారు. నాలుగేళ్ల నుంచి తమకు సీఎం మాట్లాడేందుకు ఎందుకు ఇవ్వలేదంటూ ఎమ్మెల్యేలు ప్రశ్నిస్తున్నారు.

మళ్లీ మొదలైన ఎమ్మెల్యేల తిరుగుబాటు

నియోజకవర్గాల సమన్వయకర్తల సమావేశం అనంతరం వైసీపీలో ఎమ్మెల్యేల తిరుగుబాటు మొదలైంది. తాజాగా గుంటూరుకు చెందిన సిట్టింగ్ ఎమ్మెల్యే ముస్తాఫా ప్రభుత్వంపై అసంతృప్తిని వెళ్లగక్కడం చర్చనీయంశమైంది. తన నియోజకవర్గ అభివృద్ధి పనులకు మున్సిపల్ పాలకవర్గం సహకరించడం లేదంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని ప్రభుత్వంపై ఆయన తిరుగుబాటు ప్రకటించినట్లుగా భావించవచ్చు. గతంలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి కూడా ఇదే రీతిగా తన నియోజవర్గంలో అభివృద్ధి పనులు కొనసాగడం లేదంటూ మీడియా ముందుకు వచ్చిన విషయం విదితమే. ఇప్పుడు అదే రీతిన గుంటూరు ఎమ్మెల్యే బయటకు రావడంతో వైసీపీలో అలజడి ఆరంభమైంది. వాళ్లిద్దరి పనితీరు బాగోలేదంటూ ఐ ప్యాడ్ టీమ్ అధినేతకు నివేదిక ఇచ్చిన విషయం విదితమే. ఈ నివేదికలపై గతంలో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పటి నుంచి ఆయన క్రమేపీ వైసీపీ ముఖ్యనేతలపైన, ప్రభుత్వంపైన విమర్శలు చేస్తూ వచ్చారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆయన క్రాస్ ఓటింగ్‌కు పాల్పడినట్లు వైసీపీ గుర్తించి వేటు వేసింది. సీఎం జగన్ రాబోయే ఎన్నికల్లోనూ ప్రశాంత్ కిశోర్ (పీకే) టీమ్ పైనే ఆశలు పెట్టుకున్నట్లు స్పష్టమవుతోంది. ప్రతి ఎమ్మెల్యే కదలికపైనా నిఘా ఉంచారు. 175 నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేలతోపాటు పార్టీ ఇన్‌చార్జుల పనితీరును ఎప్పటికప్పుడూ ఐప్యాడ్ టీమ్ గమనిస్తూ... ప్రభుత్వానికి నివేదిస్తోంది. వైసీపీలో తమకు టికెట్ దక్కబోదని అభిప్రాయానికి వచ్చిన వారంతా పక్క పార్టీల వైపు చూస్తున్నారు. ఇది వైసీపీకి ఇబ్బందిగా మారనుంది.

ఎమ్మెల్యేల టికెట్లకు ఎసరు !

తాజాగా నిర్వహించిన వైసీపీ సమన్వయకర్తల సమావేశంలో 18 మంది ఎమ్మెల్యేలు పనితీరు బాగోలేదని పైకి జగన్ చెప్పినప్పటికీ, ఇంకా అంతకంటే ఎక్కువ మంది ఎమ్మెల్యేల పరిస్థితి అధ్వానంగా ఉన్నట్లు తెలుస్తోంది. చాలామంది నియోజకవర్గాల అభివృద్ధిలో వెనుకబాటుకు గురయ్యారు. కొందరు ప్రజల సంక్షేమాన్ని గాలికి వదిలేసి, అక్రమ సంపాదనే లక్ష్యంగా ఈ నాలుగేళ్లపాటు కార్యకలాపాలు కొనసాగించినట్లుగా ఆరోపణలున్నాయి. భూకబ్జాలు, అవినీతి దందా, అక్రమాలు, అరాచకాలకు కొందరు పాల్పడుతున్నట్లు ప్రచారం ఉన్నప్పటికీ... వారిని నియంత్రించడంలో వైసీపీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. ఈ విషయాన్ని పదే పదే ప్రతిపక్షాలు ప్రస్తావించినా, అనేక ఉద్యమాలు చేసినా ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. ఈ విధానాలే వైసీపీ ప్రభుత్వ పతనానికి నాంది కానుందని ప్రతిపక్షాలు ధ్వజమెత్తుతున్నాయి. నాలుగేళ్లలో ఇంతవరకు అఖిలపక్ష సమావేశాన్ని సీఎం జగన్ నిర్వహించలేకపోవటం సిగ్గుచేటని తప్పు పడుతున్నాయి. ప్రజా సమస్యలపై నిత్యం ఉద్యమాలు కొనసాగుతున్నప్పటికీ, ప్రతిపక్షాలను పిలిపించి చర్చించడంలో జగన్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. విభజన హామీలు, ప్రత్యేక హోదా, పోలవరం తదితర అంశాలపై కేంద్రంపై ఒత్తిడి పెంచడంలోనూ జగన్ మౌనం వహిస్తున్నారు. బీజేపీతో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకుని, రాష్ట్ర ప్రయోజనాల్ని కేంద్రానికి జగన్ తాకట్టు పెడుతున్నారనే విమర్శలున్నాయి. రాష్ట్ర అభివృద్ధిని సీఎం జగన్ గాలికి వదిలేసి, ఎన్నికలే లక్ష్యంగా పనిచేయడం విమర్శలకు దారి తీస్తోంది. ఐప్యాడ్ టీము పైనే జగన్ పూర్తి దృష్టి పెట్టి, రాబోయే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా జగన్ చేస్తున్న ప్రయత్నాలపై సొంత పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జగన్ తన విధానాలు మార్చుకుని రాష్ట్ర అభివృద్ధి పైన దృష్టి కేంద్రీకరించాలి.

విపక్షాల ఐక్యతకు ఢోకా లేదు

పాట్నా: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఓటమే ప్రతిపక్షాల ఐక్యలక్ష్యమని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ప్రధాన కార్యదర్శి డి.రాజా నొక్కిచెప్పారు. ఉమ్మడి అజెండా, ఏకాభిప్రాయంతో ఎన్నికల్లో ఐక్యవ్యూహంతో ముందుకెళతామని చెప్పారు. స్వతంత్ర రాజకీయ పార్టీల్లో కొన్ని అంశాలపై అభిప్రాయ భేదాలు సజమని, వీటి వల్ల ప్రతిపక్షాల ఐక్యతకు విఘాతం కలుగబోదని తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటైతే నాయకత్వం వహించేది ఎవరన్నది ప్రస్తుతం ప్రధానం కాదని, సమయం వచ్చినప్పుడు దానిపై చర్చించి సరైన నిర్ణయం తీసుకుంటామని, అందుకు కావాల్సిన సామర్థ్యం, పరిపక్వత రాజకీయ పార్టీలకు ఉందని చెప్పారు. బీజేపీ అనవసర విషయాలను భూతద్దంలో పెట్టి చూపుతూ ప్రతిపక్ష కూటమిని అపహాస్యం చేసే ప్రయత్నం చేస్తోందని, ఇది ఆ పార్టీకి గౌరవం కాబోదని డి.రాజా అన్నారు. బీహార్, పాట్నాలో ప్రతిపక్షాల సమావేశంలో పాల్గొన్న ఆప్ నేతలు, దిల్లీ, పంజాబ్ ముఖ్యమంత్రులు అరవింద్ కేజ్రీవాల్, భగవంత్ మాన్ అనంతరం జరిగిన విలేకరుల సమావేశాన్ని బహిష్కరించడంపై స్పందిస్తూ వ్యతిరేకించి కాదు వేరే పనిపై వెళ్లారని చెప్పారు. ప్రతిపక్ష కూటమికి నాయకుడు ఎవరన్నది ప్రస్తుతం ముఖ్యం కాదని, తాము పట్టించుకోని అంశాలను కూడా బీజేపీ పట్టించుకుంటోందని, 2024 లోక్‌సభ ఎన్నికల ఫలితాల భయంతోనే ఇలా చేస్తోందని వ్యాఖ్యానించారు.

పాట్నాలో 15 ప్రతిపక్ష పార్టీలు సమావేశమైన నేపథ్యంలో సీపీఐ కార్యాలయంలో పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో రాజా మాట్లాడుతూ లౌకిక ప్రజాస్వామ్య పార్టీలు ఏకతాటిపైకొచ్చి ఏదేని అంశంపై కలిసి నిర్ణయించుకోగలవని అన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అసంతృప్తి సమస్య కాదని, పార్టీలకు కొన్ని అంశాల్లో అభిప్రాయబేధాలు ఉంటాయని వాటిని చర్చించి పరిష్కరించుకోవచ్చని అన్నారు. టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ చర్చల్లో క్రీయాశీలంగా పాల్గొనడం సానుకూల పరిణామంగా తెలిపారు. సీట్ల సర్దుబాటు, ఉమ్మడి అజెండా ఖరారు చేయడమేనా తరువాయన్న ప్రశ్నకు 'దేశాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు సంకల్పించాం. ఇదే సందేశాన్ని దేశప్రజలకు ఇచ్చాం. భవిష్యత్ కార్యాచరణపై తర్వాత చర్చిస్తాం. సరైన సమయంలో తగిన నిర్ణయాలు తీసుకుంటాం' అని రాజా చెప్పారు. పాట్నా సదస్సుకు హాజరైన తర్వాత జరిగిన విలేకరుల సమావేశాన్ని అరవింద్ కేజ్రీవాల్, భగవంత్ మాన్ బహిష్కరించడం వల్ల ప్రతిపక్ష కూటమికి ఆటంకం కలుగుతుందా అన్న ప్రశ్నకు 'అలా ఏమీ లేదు. ఓ రకంగా ఇది సానుకూల పరిణామం. ఎందుకంటే మావి స్వతంత్ర రాజకీయ పార్టీలు. ఎవరి అభిప్రాయాలు, దృక్కోణాలు వారికి ఉంటాయి. అలాంటప్పుడు కొన్ని విషయాల్లో అభిప్రాయ భేదాలు సహజమే. వాటిని అధిగమిస్తూ ఐక్యంగా ముందుకు సాగుతున్నాం. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, లౌకికత్వం, దేశ వైవిధ్యతకు ముప్పు పొంచివుండి దేశం అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. కాబట్టి లౌకిక ప్రజాస్వామ్య పార్టీలు ఒక మాటపై ఉన్నాయి. 2024 ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు ఐక్యంగా పోరాడాలని సంకల్పించాయి' అని రాజా బదులిచ్చారు. భవిష్యత్ సమావేశాల్లో కాంగ్రెస్‌తో కలిసి పాల్గొనడం తమకు కష్టమేనన్న ఆప్ ప్రకటనపై స్పందిస్తూ 'పాట్నా సమావేశంలో వారు చివరి వరకు ఉన్నారు. వేరొక చోటకు వెళ్లాల్సి ఉండటంతో అక్కడ నుంచి నిష్క్రమించారు తప్ప మరో కారణంతో కాదు. అయితే నేను వారి ప్రకటనను పూర్తిగా చదవలేదు' అని చెప్పారు. వచ్చేఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు లౌకికపార్టీలన్నీ కట్టుబడి ఉన్నాయని, కూటమిలో ఆప్ ఉంటుందా లేదా అన్నది ఆ పార్టీయే నిర్ణయించుకోవాలని ఓ ప్రశ్నకు రాజా బదులిచ్చారు. దేశానికి, దేశ ప్రజలకు నిబద్ధతగా ఉంటే ఏకాభిప్రాయం ఉంటుందని అన్నారు. కర్నాటక తీర్పు బీజేపీని కుదిపివేసిందని, నైరాశ్యంతో విపక్షాలపై విమర్శనాస్త్రాలు, వాక్బాణాలు సంధిస్తూ పైశాచికానందాన్ని ఆ పార్టీ పొందుతోందని విమర్శించారు. వారి పార్టీపై అసహనాన్ని బీజేపీ గ్రహించిందని, జాతీయ స్థాయిలో ఓటమి కర్నాటక నుంచి మొదలైందన్నారు. వరుడు లేని పెళ్లి తంతని బీజేపీ చేసిన వ్యాఖ్యలను అసంబద్ధ విమర్శలన్న రాజా వాటిపై స్పందించడం అనవసరమని అన్నారు. 'వారు అంత దిగజారి మాట్లాడరాదు. రాజకీయ హుందాతనంతో బీజేపీ మెలగాలి. లౌకిక ప్రజాస్వామిక పార్టీల ఐక్యతను తక్కువ చేసి మాట్లాడేందుకు దూషించడం, అనుచిత పదజాలంతో విమర్శలు చేయడం ఆ పార్టీకి గౌరవం కాదు' అని అన్నారు.

'రాజకీయ పార్టీలు పరిపక్వత చెందినవి. అన్ని అంశాలను కలిసి చర్చిస్తున్నాం. ప్రభుత్వానికి సారథ్యం ఎవరు వహించాలో కలిసి నిర్ణయిస్తాం. ప్రస్తుతానికి ఇలాంటి అంశాలపై చర్చ అక్కర్లేదు. బీజేపీ వీటిని చర్చించడం ఆపార్టీలోని నైరాశ్యానికి అద్దం పడుతోంది. రాబోయే ఎన్నికల ఫలితాల గురించి ఉన్న భయం కనిపిస్తోంది' అని రాజా అన్నారు. 1990లో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం ఏర్పాటు అయినప్పుడు హెచ్‌డీ దేవెగౌడ, ఐకే గుజరాల్‌ను ఏ విధంగా ఎన్నుకున్నామో తెలుసుకోవాలన్నారు. 'నాయకత్వంపై నిర్ణయాన్ని పార్టీలకు వదిలేయండి. సరైన నిర్ణయం తీసుకోగల సామర్థ్యం, పరిపక్వత వాటికి ఉంది. ఏకం కావాలని ప్రతిపక్ష పార్టీలు నిర్ణయించాయి. ఎన్నికలు సమీపించినప్పుడు వ్యూహాలను చర్చించి నిర్ణయిస్తాయి. ప్రతి రాష్ట్రంలోని రాజకీయ శక్తుల సమతుల్యత దృష్ట్యా కార్యాచరణ ఉంటుంది. బీజేపీ వ్యతిరేక ఓట్లను తమ వైపుకు మళ్లించుకోవడానికి కసరత్తు జరుగుతుంది. అన్ని లౌకిక ప్రజాస్వామ్య సంస్థలు మరింత బలోపేతం కావాలని, తద్వార బీజేపీకి గట్టి పోటీ ఇవ్వగలమని ప్రతిపక్ష పార్టీలు స్పష్టంగా చెబుతున్నాయి' అని డి.రాజా అన్నారు.

టాలీవుడ్‌ను కుదిపేస్తున్న 'డ్రగ్స్'

(మొదటిపేజీ తరువాయి)

జరుగుతోంది. ఇంతలోనే వీరందరికి కేపీ చౌదరితో సంబంధాలు ఉన్నట్లు కొన్ని ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. దీంతో డ్రగ్స్ తో కూడా వీరికి సంబంధం ఉందా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికే అషురెడ్డి ఈ వివాదంపై స్పందించి తనపై వస్తున్న వార్తలని తీవ్రంగా ఖండించింది. ఆ నిర్మాతతో తనకి సంబంధమే లేదని సోషల్ మీడియాలో అషురెడ్డి పోస్ట్ చేసింది. నిజం నిరూపించుకునేందుకు అవసరం అయితే విచారణకి కూడా తాను సిద్ధమని తెలిపింది. తాజాగా నటి జ్యోతి కూడా ఈ వివాదంపై స్పందించింది. క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా రొమాంటిక్ కామెడీ పాత్రలతో నటి జ్యోతి మంచి గుర్తింపు తెచ్చుకుంది. జ్యోతి వ్యాంప్ తరహా పాత్రలు కూడా చేసింది. ఆమె ఎలాంటి వ్యాంప్ రోల్ చేసినా అందులో కాస్త కామెడీ టచ్ ఉంటుంది. ఎవడిగోల వాడిది చిత్రంలో 'సమర్పించేసుకుంటాను' అంటూ నవ్వించిన జ్యోతి ఆ తర్వాత దరువు, అల్లరి నరేష్ యముడికి మొగుడు లాంటి చిత్రాల్లో మెరిసింది. ఈ వివాదంపై జ్యోతి మాట్లాడుతూ.. నిన్నటి నుంచి మీడియాల్లో నా అనుమతి లేకుండా నా ఫోటోలని ప్రచురిస్తూ హంగామా చేస్తున్నారు. మహిళని కాబట్టి ఈజీగా టార్గెట్ చేస్తున్నారు. అసలు విచారణలో ఉన్న కేసులో ఎలాంటి వాస్తవాలు తేలకముందే నాకు సంబంధం ఉన్నట్లు ఎలా ప్రచురిస్తారు. అంత ధైర్యం ఏంటి... మహిళని కాబట్టి టార్గెట్ చేయొచ్చు అనుకున్నారా అంటూ ప్రశ్నించింది. నాకు డ్రగ్స్ తో ఎలాంటి సంబంధం లేదు అని జ్యోతి తెలిపింది. కానీ నిర్మాత కేపీ చౌదరితో మాత్రం పరిచయం ఉన్నట్లు అంగీకరించింది. అతడు నాకు ఫ్యామిలీ ఫ్రెండ్. ఆయన హైదరాబాద్ వచ్చినప్పుడు వాళ్ళ అబ్బాయిని మాయా ఇంట్లో వదిలేసి వెళతారు. మా అబ్బాయితో వాళ్ళ అబ్బాయి బాగా ఆడుకుంటాడు. అలాగే మేము ఫోన్ లో కూడా మాట్లాడుకుంటాం. బావున్నారా, మీ ఫ్యామిలీ మెంబర్స్ బావున్నారా అంతవరకే మాట్లాడుకుంటాం. కావాలంటే నా కాల్ డేటా నేను డిలీట్ చేయలేదు. చెక్ చేసుకోవచ్చు. అతనితో పరిచయం ఉన్నంత మాత్రాన డ్రగ్స్ తో నాకు సంబంధం ఉన్నట్లు ఎలా చిత్రీకరిస్తారు అని జ్యోతి ప్రశ్నించింది. నాకు ఆల్కహాల్ కూడా పెద్దగా అలవాటు లేదు. ఎప్పుడైనా పార్టీలలో మాత్రమే అది కూడా కొద్దిగానే అని జ్యోతి తెలిపింది. ఇలా తప్పుడు వార్తలు వేస్తే మాకు కుటుంబ సభ్యులు ఉంటారు.. వాళ్ళు ఎంతగా భాదపడతారో అని ఆలోచించారా అని జ్యోతి ప్రశ్నించింది. నేను నటిని.. ఆయన నిర్మాతగా ఉన్నారు. కాబట్టి నటీనటులు, నిర్మాతల మధ్య ఫోన్ కాంటాక్ట్స్ సహజంగానే ఉంటాయి అని జ్యోతి స్పష్టత ఇచ్చింది. డ్రగ్స్ తో తనకి సంబంధం ఉన్నట్లు తప్పుడు వార్తలు రాయొద్దని జ్యోతి కోరింది. ఈ క్రమంలో సురేఖావాణి కూడా స్పందించారు. ఆమె ఒక వీడియో విడుదల చేస్తూ... డ్రగ్ కేసు అనే పదం వాడకుండా తమకు సంబంధం లేదంటూ వివరణ ఇచ్చారు. కొద్దిరోజులుగా మాపై వస్తున్న ఆరోపణలతో మాకు సంబంధం లేదు. నిరాధార కథనాల వల్ల నా కెరీర్ నాశనమవుతుంది. మా కుటుంబ సభ్యుల ఆరోగ్యం దెబ్బతింటుంది. దయచేసి మమ్మల్ని వదిలేయమంటూ తెలిపింది. కాగా సురేఖావాణి కేపీ చౌదరికి ముద్దు పెడుతున్న ఫోటో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. అలాగే సుప్రీత కూడా అతనితో సన్నిహితంగా కనిపించారు. వీరిద్దరికీ కేపీ చౌదరి మిత్రుడని సదరు ఫోటోలు చూస్తే అర్థం అవుతుంది. కేపీ చౌదరి సెలెబ్రిటీలకు డ్రగ్ పార్టీలు ఏర్పాటు చేస్తాడని తెలిసింది. చిత్ర పరిశ్రమలో కేపీ చౌదరి వద్ద డ్రగ్స్ కొనేవాళ్ళు, అతనితో కలిసి దందా చేసే వాళ్లు చాలా మంది ఉన్నట్లు సమాచారం. కేపీ చౌదరి ప్రస్తుతం పోలీస్ కస్టడీలో ఉన్నారు. అతన్ని విచారిస్తున్నారు. బ్యాడ్మింటన్ ప్లేయర్ సిక్కిరెడ్డి నివాసంలో కొకైన్ పార్టీ కేపీ చౌదరి నిర్వహించినట్లు పోలీసులు గుర్తించారు.

జగన్ అనాలోచిత నిర్ణయాలతో
అల్లాడుతున్న ప్రజలు
సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-తుళ్లూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అనాలోచిత నిర్ణయాలు వల్ల రాష్ట్ర ప్రజలు అల్లాడిపోతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. గుంటూరు జిల్లా తుళ్లూరులో ఆదివారం రామకృష్ణ మాట్లాడుతూ నాలుగేళ్లుగా 5రాజధాని లేని రాష్ట్రంగా చెప్పుకోవాల్సిన దుస్థితి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు జగన్‌మోహన్ రెడ్డి కల్పించాడని విమర్శించారు. ఒకవైపు విశాఖపట్నం, కర్నూలు అభివృద్ధి చేయకపోగా మరోవైపు అమరావతిలో అభివృద్ధిని చంపేసి రాజకీయంగా లబ్ది పొందడానికి ప్రయత్నం చేశారన్నారు. 1286 రోజులుగా ఇక్కడ రైతులు, మహిళలు పోరాటం చేస్తున్నారని.. దానిమీద ఎటువంటి స్పందన లేదన్నారు. అఖిలభారత కిసాన్‌సభ (ఏఐకేఎస్) అధ్యక్షులు రావుల వెంకయ్య మాట్లాడుతూ అమరావతి రాజధాని నిర్మాణం కోసం జరుగుతున్న రైతుల పోరాటం ఆంధ్రప్రదేశ్ చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. రైతు సమస్యలపై దిల్లీ సరిహద్దులో ఎంతో వీరోచితంగా రైతులు పోరాడి విజయాన్ని సాధించారని.. నరేంద్ర మోదీ మెడలు వంచి వినాశకర చట్టాలను రద్దు చేయించారని అన్నారు. అదే తరహాలో ఇక్కడ అమరావతి రైతాంగ ఉద్యమం కాలాతీతంగా మిగలదని.. ఇక్కడ రైతులు ఏదైతే రాజధాని సాధించాలని పోరాడుతున్నారో అది కూడా విజయం సాధిస్తుందీ, చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. ఇప్పటికైనా జగన్‌మోహన్ రెడ్డి కళ్లు తెరిచి అమరావతిని రాజధానిగా ప్రకటించి దాని అభివృద్ధి కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంబటి ఆంజనేయులు కన్నుమూత

(మొదటిపేజీ తరువాయి)

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఎంతో దోహదం చేశారు. ఐజేయూ నాయకుడిగా దేశంలోని జర్నలిస్టు నాయకులు అందరితో ఆయనకు సన్నిహిత పరిచయాలు ఉన్నాయి. ఐజేయూ అధ్యక్షులు కే శ్రీనివాస్ రెడ్డి అంబటి ని ఆదర్శంగా తీసుకునే వారు. జర్నలిస్టు సమస్యలపై ఆయన సలహా సంప్రదింపులను కూడా తీసుకునేవారు.

ఐజేయూ, ఏపీయూడబ్ల్యూజే సంతాపం

అంబటి ఆంజనేయులు మృతికి ఐజేయూ అధ్యక్షులు కె శ్రీనివాస్ రెడ్డి, విశాలాంధ్ర ఎడిటర్ ఆర్వీరామారావ్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు ఐవీ సుబ్బారావు, చందు జనార్ధన్, విజయవాడ అర్బన్ యూనిట్ అధ్యక్ష, కార్య దర్శులు చావా రవి, కొండా రాజేశ్వరరావు, ఐజేయూ కౌన్సిల్ సభ్యులు ఎస్కే బాబు, కూన అజేయ్ బాబు, సాంబశివరావు, సామ్నా అధ్యక్ష, కార్యదర్శులు నల్లి ధర్మారావు, సీహెచ్ రమణారెడ్డి , ఏపీయూడబ్ల్యూజే కౌన్సిల్ సభ్యులు దారం వెంకటేశ్వరరావు, దాసరి నాగరాజు, వసంత్, మోదుమూడి మురళీకృష్ణ రఘు, రామారావు, ఎంవీ సుబ్బారావు తదితరులు ప్రగాఢ సంతాపం తెలిపారు.

సంక్షేమ కార్యక్రమాలతోపాటు ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు అవశ్యం
సురవరం సుధాకరరెడ్డి

విశాలాంధ్ర-హైదరాబాద్: సంక్షేమ కార్యక్రమాలతో పాటు, ప్రజలతో ప్రత్యక్ష సంబంధం ప్రజానాయకుల ప్రధాన కర్తవ్యంగా సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి పేర్కొన్నారు. ప్రజలను సామూహికంగా (ప్రజా దర్బార్) కలవనక్కర్లేదని , ఇంత పెద్ద ప్రభుత్వ యంత్రాంగం పనిచేయకపోతేనే సీఎం కలవాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నట్లుగా కేటీఆర్ చేసిన ట్వీట్‌పై ఆశ్చర్యవ వ్యక్తంచేశారు. ఈ మేరకు ఆదివారం సురవరం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ ప్రకటన ఇలావుంది. మన అధికార యంత్రాంగం శక్తివంతమైనదే కానీ అనేక సందర్భాలలో అది నిరంకుశమైనది. చట్టం పేరుతో సమస్యలు పరిష్కారం కాకుండా ఇబ్బంది పెడతారు. కొంతమంది ప్రజానుకూలంగా ఉంటే ప్రజాప్రతినిధులు వారిని పనిచేయకుండా నిర్బంధిస్తారు. అవినీతి పరులు ప్రజలను ఇబ్బంది పెడతారు. కొన్ని ప్రభుత్వ నిబంధనలు లోపభూయిష్టంగా ఉండి తీవ్రమైన అడ్డంకులు సృష్టిస్తాయి. ఇవి ఎవరికి చెప్పుకోవాలి ? ఎవరు పరిష్కరిస్తారు? దేశంలో కూడా పెద్ద అధికార యంత్రాంగం, గొప్ప అధికారులు ఉన్నప్పటికీ, పీవీ నరసింహారావు ప్రధానిగా ప్రతిరోజు కొన్ని వందల మంది ప్రజలను కలిసేవారు. రోజు ఉదయం గంట, గంటన్నరలో ముగించేవారు. ముందే అధికారులు వారిని గుంపులుగా విభజించి, వారి సమస్యలు నోట్స్ రాసుకొని, ప్రధాని వచ్చినపుడు వివరించేవారు. దరఖాస్తులు ప్రధాని చేతుల మీదుగా అధికారులకు ఇచ్చేవారు. వాటిని సంబంధిత అధికారులకు పంపి, మళ్లీ జవాబు పంపేవారు. వాజపేయి, మన్మోహన్ సింగ్ ఆ సంప్రదాయం కాక, ప్రజా ప్రతినిధులను, రాష్ట్రాల ప్రతినిధి వర్గాలను కలిసేవారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి పీవీ పద్ధతిలో జనాల్ని కలిసేవారు. ఒక పర్యాయం ఎన్టీఆర్ నగర్ ఉన్న స్థలం ఒక ప్రైవేట్ వకీలుదని, ఆయన స్వాతంత్ర్య సమరయోధుడని హైకోర్టు తీర్పు ఇచ్చింది. వేలాదిమంది నిరాశ్రయులు అవుతారని మేము పెద్ద ప్రదర్శనగా సీఎం ఇంటికి వెళ్లాం. ఒక ముప్పై నలభై మందిని మాత్రం లోపలికి పంపించారు.

పోలవరం ఇంకెన్నాళ్లు?

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటించారు. ముఖ్యమంత్రి కాగానే రివర్స్ టెండరింగ్ గేమ్ ఆడారే కాని, కనీసం రూ.10 వేలు కూడా అవినీతి సొమ్మును పట్టుకోలేకపోయారు. నిర్వాసితులకు ఏ ఒక్క వరం దక్కలేదు. పోలవరాన్ని 2021 ఏప్రిల్ లోగా పూర్తి చేస్తామని, తర్వాత 21 డిసెంబర్ లోగా పూర్తి చేస్తామని, ఆ తర్వాత 22 ఏప్రిల్ లోగా పూర్తి చేస్తామని అప్పటి జల వనరుల శాఖ మంత్రి అసెంబ్లీలో ప్రగల్భాలు పలికారు కానీ నేటికీ ప్రాజెక్టు నత్తనడకనే సాగుతోంది. మళ్లీ ప్రాజెక్టు ఎత్తుపై, మార్పులపై, ఎగువ కాఫర్ డ్యామ్ పై చర్చలు మొదలయ్యాయి. ఆఖరికి పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టు నుంచి ఎత్తిపోతల పథకం స్థాయికి దిగజార్చారు. వాస్తవానికి ప్రాజెక్టు పూర్తయితే 7.2 లక్షల ఎకరాలకు సాగునీరు, 960 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి, విశాఖకు 23.44 టీఎంసీ ల తాగునీరు, కృష్ణ డెల్టా లోని 3 లక్షల ఎనభైవేల ఎకరాల సాగునీటి అవసరాలు, 540 గ్రామాలలో 28.5 లక్షల మందికి తాగునీటి అవసరాలు కూడా తీరుతాయి. బహుళ ప్రయోజనాలు ఉన్న పోలవరం బహుళార్థ సాధక ప్రాజెక్టు నిర్మాణం ఏళ్లతరబడి సాగుతుండటం ఆంధ్రుల దురదృష్టం.

నేడు పోలవరంలో బహిరంగ సభ

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం మొదటి నుంచి సీపీఐ అలుపెరకుండా పోరాడుతోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాజధాని నగరం హైదరాబాదులో సీపీఐ భారీ ధర్నా నిర్వహించింది. జిల్లా కేంద్రం, మండల కేంద్రాలలో ధర్నాలు రాస్తారోకోలు, వివిధ రూపాలలో ఆందోళన చేపట్టింది. పోలవరం నిర్వాసితుల నష్టపరిహారం చెల్లింపు, ప్రాజెక్టు సత్వర నిర్మాణం కోసం సీపీఐ అధ్వర్యంలో ఈ నెల 12 నుంచి 20వ తేదీ వరకు కుక్కునూరు, వేలేరుపాడు, జీలుగుమిల్లి, టి నరసాపురం, జంగారెడ్డిగూడెం లోని పునరావాస కాలనీలు, కొయ్యలగూడెం, బుట్టాయిగూడెంలో సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య అధ్వర్యంలో జీపు జాతా నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకుని, కరపత్రాలు పంచి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. తాజాగా జూన్ 26వ తేదీ సోమవారం పోలవరంలో సీపీఐ అధ్వర్యంలో బహిరంగ సభ జరగనుంది. ఈ సభలో భవిష్యత్ ఉద్యమ కార్యాచరణకు ప్రణాళికలు రూపొందిస్తారు. బహిరంగ సమావేశానికి సీపీఐ రాజ్యసభ సభ్యులు సంతోష్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సహాయ కార్యదర్శులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, జేవీ సత్యనారాయణమూర్తి, ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శులు, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్, టీడీపీ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తులసి రెడ్డి, కిసాన్ సెల్ అధ్యక్షుడు జెట్టి గురునాధరావు, జనసేన రాష్ట్ర నాయకులు కందుల దుర్గేష్ తదితర అగ్ర నాయకులు పాల్గొంటారు.

నేటి నుంచి రైతుల ఖాతాల్లోకి 'రైతుబంధు'

హైదరాబాద్: సీఎం కేసీఆర్ నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం రైతులకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు ప్రతిష్ఠాత్మకంగా రైతుబంధు పథకాన్ని తీసుకువచ్చింది. ఆరుగాలం కష్టపడే అన్నదాతలకు పెట్టుబడి సాయంగా ఏటా ఎకరానికి రూ.10వేల చొప్పున ఆర్థికం అందిస్తున్నది. ఇప్పటికే పది విడతల్లో రైతుల ఖాతాల్లో నిధులు జమ చేసింది. పదకొండో విడతలో భాగంగా సోమవారం (జూన్ 26) నుంచి రైతుల ఖాతాల్లో నుంచి రైతుబంధు ఆర్థిక సాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి తెలిపారు. వానాకాలం పంటకు సంబంధించి 70లక్షల మంది రైతులకు రైతుబంధు సాయం అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సారి 1.5లక్షల మంది పోడురైతులకు సైతం రైతుబంధు అమలు చేయనున్నట్లు చెప్పారు. రైతుల ఖాతాల్లో మొత్తం రూ.7720.29కోట్లు జమకానున్నాయని, 1.54కోట్ల ఎకరాలకు రైతుబంధు సాయం అందించనున్నట్లు వివరించారు.

పెత్తందారులపై చర్యలు తీసుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

అందజేయడానికి వెళుతున్న దళిత సంఘాల కమిటీ వాహనాలను పోలీసులు అడ్డుకున్నారు. చట్టప్రకారం శాంతిభద్రతలు కాపాడాల్సిన పోలీసులు దళిత యువకులపై దాడి చేయడం గర్హనీయం. పార్టీలకతీతంగా దళిత భరోసా యాత్ర చేస్తుంటే దాన్ని అడ్డుకుని విచక్షణారహితంగా అరెస్టులు చేయడం ఆక్షేపణీయం. పోలీసుల అండతో పెత్తందారులు దళితులను వేధిస్తున్నారు. బహిష్కరణ గురించి తెలిసినా ఎస్సీ కమిషన్ ఇంతవరకు జోక్యం చేసుకోకపోవడం గమనార్హం' అని ప్రకటనలో వామపక్షాలు పేర్కొన్నాయి.

కాగా, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, వై.సాంబశివరావు సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, జాస్తి కిషోర్‌బాబు సీపీఐ(ఎంఎల్), కాటం నాగభూషణం ఎంసీపీఐ(యూ), ఎన్.మూర్తి సీపీఐ(ఎంఎల్) లిబరేషన్, చిట్టిపాటి వెంకటేశ్వర్లు సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, బీఎస్ అమర్‌నాథ్ ఎస్‌యూసీఐ (సీ), పీవీ సుందరరామరాజు (ఫార్వర్డ్‌బ్లాక్), జానకి రాములు (రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ) పేర్లతో ప్రకటన వెలువడింది.

సహకార బ్యాంకింగ్ పల్లెలకు విస్తరించాలి

ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: సహకార బ్యాంకింగ్ వ్యవస్థ పల్లెలకు విస్తరించాల్సిన అవసరం ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంకు చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి అన్నారు.'సహకార భూమి పక్ష పత్రిక' రెండో సంచికను ఆదివారం సాయంత్రం విజయవాడ శ్యామ్‌నగర్ ఎన్జీవో కో-ఆపరేటివ్ కాలనీలోని సంస్థ కార్యాలయంలో ఝాన్సీరాణి ఆవిష్కరించారు. ఎన్టీఆర్ జిల్లా సహకార శాఖ అధికారి చిత్రపు శైలజ అధ్యక్షతన జరిగిన సభలో ఆమె ప్రసంగించారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి తీసుకున్న ప్రోత్సాహక చర్యలు, నాబార్డ్ సహకారంతో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలను బహుళ ప్రయోజన సంఘాలుగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నామని ఝాన్సీరాణి చెప్పారు. ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా సహకార బ్యాంకింగ్ వ్యవస్థ పల్లెలకు విస్తరించాలన్నారు. సహకార సంఘాలకు ఇది స్వర్ణ యుగమని తాను భావిస్తున్నానన్నారు. కేంద్రంలోనూ కొత్తగా సహకార శాఖను ఏర్పాటు చేసి సంఘాల విస్తరణకు ప్రయత్నించటం ఇందుకు కారణమన్నారు. సహకార సంఘాలను నష్టాల నుంచి లాభాల బాటలోకి తీసుకెళ్లడానికి పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వందేళ్ల క్రితం ఏర్పాటై దిగ్విజయంగా నడిచిన సహకార సంఘాలను కాపాడుకోలేని పరిస్థితి దురదృష్టకరమన్నారు. ప్రస్తుతం పిల్లల చదువులు, పెళ్లిళ్ల కోసం సహకార బ్యాంకుల ద్వారా రుణాలు అందిస్తున్నామనీ, రైతులకు భూమి తనఖాపై గ్రామాల్లోనూ గృహ రుణాలు అందిస్తున్నామని తెలిపారు. కమర్షియల్ బ్యాంకులకు పోటీగా సేవలందిస్తూ ఈరోజు సహకార బ్యాంకులు విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు సహకారం పక్షపత్రిక తోడ్పడుతుందని ఆశిస్తున్నట్టు ఝాన్సీ రాణి చెప్పారు. సహకారభూమి పక్షపత్రిక దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఇందుకు తమవంతుగా ఆప్కాబ్ ద్వారా అవసరమైన పూర్తి సహాయ, సహకారాలు అందిస్తామని ప్రకటించారు. సహకారభూమి వ్యవస్థాపక అధ్యక్షులు, కేడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ తన్నీరు నాగేశ్వర రావు మాట్లాడుతూ సహకార రంగాన్ని ప్రభావితం చేసేలా సహకారభూమి తోడ్పడుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. విజయవంతంగా నడుస్తున్న సంఘాల సక్సెస్ స్టోరీలు, సంఘాలు నష్టాల పాలైతే అందుకు కారణాలు రాయటం ద్వారా ప్రక్షాళనకు అవకాశం లభిస్తుందన్నారు. తెలుగులో విజయవంతం కావడం ద్వారా ఇతర భాషల్లో కూడా పత్రిక ప్రచురణ జరిగేలా కృషి చేయాలని పాత్రికేయులను కోరారు. సహకారభూమి పక్షపత్రికను సత్సంకల్పంతో, మంచి ఉద్దేశంతో ప్రారంభించారని డీసీవో శైలజ అన్నారు. ఒక ఆలోచన కార్యరూపం దాల్చడం అదృష్టంగా భావించాలని, ఇందుకు కృషి చేసిన వారిని అభినందించారు. సహకార రంగంలో పరిణామాలు, మార్పులు, సాంకేతిక అభివృద్ధి అంశాలు ఈ పత్రిక ద్వారా తెలియజేయాలని ఆకాంక్షించారు. సహకారభూమి సహకార సంఘం చైర్మన్ దాసరి కేశవులు పత్రిక స్థాపన వెనక ఉద్దేశాలను వెల్లడించారు. తొలుత సహకార పతాకాన్ని శారదాంబ సహకార మహిళా అర్బన్ బ్యాంక్ చైర్‌పర్సన్ శిష్టా కుసుమ లావణ్య దేవి ఎగురవేశారు. కర్మయోగి సహకారి జవ్వాది చిత్రపటాన్ని శైలజ ఆవిష్కరించారు. గుంటూరు మహిళా సహకార అర్బన్ బ్యాంక్ చైర్‌పర్సన్ కాలువ వాణి సుజాత జ్యోతిప్రజ్వలన చేశారు. సభకు సహకారభూమి కార్యదర్శి వీరమాచినేని రత్నప్రసాద్ స్వాగతం పలికి, అతిథులను పరిచయం చేశారు. కార్యక్రమాల్లో సహకారభూమి ఎడిటర్ అక్బర్ పాషా, కోశాధికారి ఎల్లారావు, డైరెక్టర్లు చావా రవి, జి.రవీంద్ర, రవీంద్రారెడ్డి, శరత్చంద్ర జ్యోతిశ్రీ, కేవీ కృష్ణ, టీవీ నరసింహారావు, రామారావు, ఆదిశేషా రావు, సాంబిరెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగ ఖాళీలపై శ్వేత పత్రం : ఏఐవైఎఫ్ డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో ఉన్న ఉద్యోగ ఖాళీలపై శ్వేత పత్రం విడుదల చేసి భర్తీ కోసం వెంటనే నోటిఫికేషన్ ఇవ్వాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు డిమాండ్ చేశారు. ఆదివారం దాసరి భవన్‌లో ఏఐవైఎఫ్ విజయవాడ నగర సమితి సమావేశం బేవర శీను అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాజేంద్రబాబు మాట్లాడుతూ గత ఆరేళ్ల నుంచి డీఎస్సీ నోటిఫికేషన్ రాకపోవడంతో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ కాలేదని ప్రభుత్వం వెంటనే మెగా డీఎస్సీ ద్వారా 50వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రూప్ 1,2, ఉద్యోగాల పోస్టులు పెంచాలని, ఖాళీగా ఉన్న సుమారు 26,000 ఎస్సై కానిస్టేబుల్ ఉద్యోగాలు భర్తీ కాకపోవడంతో నిరుద్యోగులు తీవ్ర నిరాశ గురవుతున్నారని తెలిపారు. గ్రామీణ సచివాలయంలో చాలా ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, వాటిని ఎందుకు భర్తీ చేయడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో నూతనంగా పరిశ్రమలు రావడంలేదని స్థానికంగా ఉన్న యువత... ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం వెంటనే నిరుద్యోగ యువతను ఆదుకునేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు.

ప్రజా ఉద్యమాల్లో యువత పాల్గొనాలి: జి.కోటేశ్వరావు

ఉద్యోగాలు, ఉపాధి కోసం జరిగే పోరాటలతోపాటు ప్రజా సమస్యలపై జరిగే ప్రజా ఉద్యమాల్లో యువత చురుకుగా పాల్గొనాలని సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఉద్యమాల ద్వారానే ఉద్యోగ ఉపాధి అవకాశాలను సాధించుకోవాలని సూచించారు. ప్రజా నాట్యం మండలి రాష్ట్ర కోశాధికారి ఆర్ పిచ్చయ్య అభ్యుదయ గీతాలు ఆలపించి ఉత్తేజపరిచారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు లంకా గోవిందరాజులు, విజయవాడ నగర ఆఫీస్ బేరర్స్ షేక్ అలీ, కాళ్ళ విజయ్, పాశం ఆంజనేయులు, ఎస్. లాల్ మోహన్ , గుంజా క్రాంతి,లంకె సాయి, ఐ.ఆంజనేయులు, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

ఐటీ హబ్ దిశగా విశాఖ: విజయసాయిరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో -అమరావతి: ఐటీ హబ్ దిశగా విశాఖ అడుగులు వేగవంతం అవుతున్నాయని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం బీచ్ ఐటీ కాన్సెప్ట్ ను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తుండడంతో దిగ్గజ సంస్థలు విశాఖకు క్యూ కడుతున్నాయని రాజ్యసభ సభ్యులు, వైసీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఆదివారం ఆయన వివిధ అంశాలను వెల్లడించారు. ఈ నెల 28న విశాఖలో ప్రముఖ దిగ్గజ ఐటీ సంస్థ ఇన్ఫోసిస్ తన కార్యకలాపాలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు రుషికొండ ఐటీ హిల్స్ లో ఇన్ఫోసిస్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మాణం పూర్తయ్యిందన్నారు. ఇదే బాటలో విప్రో, ఐబీఎం, టీసీఎస్ సంస్థలు విశాఖ నుంచి కార్య కలాపాలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నాయని చెప్పారు. దశాబ్దాల తరబడి వేధించిన లక్షలాది భూ సమస్యలకు భూముల రీసర్వే ద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తోందని తెలిపారు. ఈ మేరకు నిర్వహిస్తున్న భూ సర్వే విజయవంతంగా కొనసాగుతోందన్నారు. 2 వేల గ్రామాల్లో ఇప్పటికే సర్వే పూర్తయిందని, 2 లక్షల మ్యుటేషన్లు, 4.3 లక్షల సబ్ డివిజన్లతో లక్షల మంది రైతులకు మేలు జరిగిందని వివరించారు. దీంతో 20 వేలకుపైగా భూ వివాదాల పరిష్కారం అయ్యాయని పేర్కొన్నారు. కడుపులో కత్తులు పెట్టుకుని కౌగిలించుకునే బదులు విపక్ష పార్టీలు ఎవరికివారే ప్రజాక్షేత్రంలోకి వెళ్తే ఎవరి బలమెంతో మరింత స్పష్టంగా తెలిసిపోతుందని విజయ సాయిరెడ్డి అన్నారు. అప్పుడు ఈ ముసుగులో గుద్దులాటల అవసరం ఉండబోదని సూచించారు.

మహిళలకు సమాన అవకాశాల కోసం పోరు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సహాయ కార్యదర్శి ముప్పాళ్ల పిలుపు

విశాలాంధ్ర - నంద్యాల : మహిళలకు అన్ని రంగాల్లో సమాన అవకాశాల కోసం పోరాడాలని, ఆర్థికాభివృద్ధి, విద్య,వైద్య రంగాల్లో మహిళలు భాగస్వాములు కావాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర 15వ మహాసభల ఆహ్వాన సంఘం సమావేశం నంద్యాల రామకృష్ణ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో ఆదివారం మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సుగుణమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముప్పాళ్ళ, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దుర్గా భవాని, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు మాట్లాడారు. రామకృష్ణ విద్యాసంస్థల అధినేత డాక్టర్ జి.రామకృష్ణారెడ్డి, నంద్యాల మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నిసా, నెరవాటి హాస్పిటల్ గైనకాలజిస్టు డాక్టర్ అరుణకుమారి, మహిళా ఉద్యమ నాయకులు గౌరు యాదవ్ తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ చట్ట సభల్లో మహిళలకు మూడో వంతు రిజర్వేషన్ల అమలు కోసం ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య పోరాడుతోందన్నారు. మహిళలకు సమాన పనికి సమాన వేతనం, బాలికల విద్యను ప్రోత్సహించడం, సామాజిక ఆర్థిక రాజకీయ రంగాలలో రిజర్వేషన్లపై మహిళా సమాఖ్య పోరాడుతోందని, ఆపోరాట ఫలితంగానే అనేక చట్టాలు అమలయ్యాయన్నారు. నంద్యాలలో రాష్ట్ర మహాసభలు నిర్వహించడం అభినందనీయ మన్నారు. మహిళా సాధికా రికత రావాలంటే ఔత్సహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్స హించాలన్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాలలో మహిళలు ముందంజలో ఉన్నారని, మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వాలు అవకాశాలు కల్పించా లన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు అన్ని రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్. రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు జయలక్ష్మి, ఎస్టీయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిమ్మప్ప, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆజంబేగ్, మౌలాలి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకన్న, రాధాకృష్ణ, పట్టణ కార్యదర్శి ప్రసాద్, సీపీఐ నాయకులు సుబ్బరాయుడు, సోమన్న, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు రామసుబ్బయ్య, ఏఐఎస్ఎఫ్, వైఎఫ్ జిల్లా కార్యదర్శులు ధనుంజ యుడు,నాగరాముడు, సహాయ కార్యదర్శి సురేష్, మహిళా సమాఖ్య నాయకురాల్లు, సీపీఐ ప్రజా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కామ్రేడ్ మంగాయమ్మ మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు

విశాలాంధ్ర - రాజోలు : కామ్రేడ్ దేవ ముసలయ్య సతీమణి దేవ మంగాయమ్మ మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని, ఆమె ఆశయాలు లక్ష్యంగా సీపీఐ శ్రేణులు ప్రజా సమస్యలపై పోరాడాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు దేగ ప్రభకార్ అన్నారు. సీపీఐ మలికిపురం మండల కార్యదర్శి దేవ సురేశ్ బాబు అధ్యక్షతన అంబేద్కర్ కోనసీమ జిల్లాలో మలికిపురం మండలం దిండి గ్రామంలో మంగాయమ్మ సంతాప సభ ఆదివారం జరిగింది. తొలుత మంగాయమ్మ చిత్రపటానికి కుటుంబ సభ్యులు డి సుజాత, దేవ రాజేంద్రప్రసాద్, రాధాకృష్ణన్, దేగ ప్రభకార్, పార్టీ జిల్లా కార్యదర్శి కె సత్తిబాబు, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు నెక్కంటి సుబ్బారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేగ ప్రభాకర్ మాట్లాడుతూ పేదల సమస్యలపై పోరాటంలో దేవ ముసలయ్య కుటుంబం ముందుందని, దశాబ్దాలుగా పేదలకు అండగా నిలిచిందన్నారు. దిండి గ్రామంలో దళితులు, ఇతర పేదలకు ఎర్రజెండా అండగా నిలిచిందని, దిండి గ్రామంలో పేదల భూముల కోసం ముసలయ్య చేసిన పోరాటంలో ఆయన సతీమణి మంగాయమ్మ కీలక పాత్ర పోషించారని అన్నారు. సత్తిబాబు మాట్లాడుతూ మంగాయమ్మ ఆశయాలతో యువజన ఉద్యమాన్ని, మహిళ ఉద్యమాన్ని ముందుకు నడిపించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు నెక్కంటి ప్రభాకరరావు మాట్లాడుతూ ఉత్తమ కమ్యూనిస్టు కార్యకర్తగా, పిల్లలకు ఉత్తమ విద్యా బుద్ధులు అందించిన ఉపాధ్యాయురాలు మంగాయమ్మ అని కొనియాడారు. రాజోలు దీవిలో దేవ ముసలయ్య, మంగాయమ్మతో కమ్యూనిస్టు ఉద్యమాలు ఆగిపోకూడదని వారి కుటుంబ సభ్యులను కూడా కమ్యూనిస్టు ఉద్యమంలో భాగం చేశారన్నారు. కుమార్తె సుజాత మాట్లాడుతూ ప్రజలు సేవా చేయాలని తన తల్లిదండ్రులు తనను డాక్టర్‌ను చేశారని, వారి కోరిక మేరకు దిండిలో ఒక సెంటర్ ఏర్పాటు చేసి పేదలకు వైద్య సేవలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ముదునూరి శ్రీనివాసరాజు, డాక్టర్ సదానందం, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు హేమశంకర్, సీపీఎం నాయకులు పీతల రామచంద్ర రావు, రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కొండా దుర్గరావు, పౌర హక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి జిలెల్ల మనోహర్, చైతన్య, కుటుంబ సభ్యులు డి.సుజాత, దేవ రాజేంద్రప్రసాద్, రాధాకృష్ణన్ పాల్గొన్నారు.

ఆరెపల్లిలో బయటపడ్డ 7వ శతాబ్ది శిల్పం

హైదరాబాద్: సిద్ధిపేట జిల్లా దుద్దెడ మండ లం ఆరెపల్లి వేంకటేశ్వరాలయం వద్ద అరుదైన మహిషాసురమర్దిని శిల్పం బయల్పడిందని కొత్త తెలంగాణ చరిత్రబృందం కన్వీనర్ రామోజు హరగోపాల్ తెలిపారు. సిద్ధిపేటకు చెందిన కొత్త తెలంగాణ చరిత్ర బృందం కో-కన్వీనర్ వేముగంటి మురళీకృష్ణ, సభ్యులు అహోబిలం కరుణాకర్, మహమ్మద్ నసీర్, ఈమని శివనాగిరెడ్డి, ఎస్.జైకిషన్‌తో కలిసి ఆ శిలాఫలకాన్ని పరిశీలించి ఆసక్తికర విషయాలు వెల్లడించారు. 18 సెం.మీ. పొడవు, 10 సెం.మీ. వెడల్పు, 2 సెం.మీ.ల మందం కలిగిన ఈ శిలాఫలకం బాదామీ చాళుక్యుల తొలికాలం క్రీ.శ.7వ శతాబ్దికి చెందినదని హరగోపాల్ తెలిపారు. గతంలో విష్ణుకుండినుల కాలపు(5వ శతాబ్ది) మహిషాసురమర్దిని శిల్పం కీసరగుట్టలో లభించిందని, ఇటీవల నల్గొండ జిల్లా పానగల్లులో అదే కాలానికి చెందిన మహిషాసురమర్దిని చిన్న శిలాఫలకాన్ని ఈమని శివనాగిరెడ్డి, డి.సూర్యకుమార్ గుర్తించారన్నారు. ఆరెపల్లిలో వెలుగుచూసిన ఈ చిన్న మహిషాసురమర్దిని శిలాఫలకం బాదామీలోని శిల్పం కంటే ముందుదని, తెలంగాణాకు సంబంధించి బాదామీ చాళుక్యుల కాలానికి చెందిన తొలి మహిషాసురమర్దిని శిలాఫలకమనీ, ఆ తరువాత పెద్ద పరిమాణంలో అమ్మవారి శిల్పాలు ఆలంపురం వంటి క్షేత్రాల్లో అనేకం బయటపడినాయని ఆయన అన్నారు. పురావస్తు, చారిత్రక ప్రాధాన్యత కలిగిన తొలి చాళుక్య ప్రతిమా లక్షణం, శిల్పకళాశైలికి అద్దం పడుతున్న ఈ శిలాఫలకాన్ని భద్రపరిచి, భవిష్యత్ తరాలకు అందించాలని కొత్త తెలంగాణ చరిత్రబృందం... ఆరెపల్లి గ్రామస్తులకు, ఆలయ కమిటీకి విజ్ఞప్తి చేసింది.

రైతులను అన్ని విధాలా ఆదుకోవాలి

లేకపోతే ఉద్యమిస్తామని రాష్ట్ర ప్రభుత్వానికి సీపీఐ నేతల హెచ్చరిక

నేటి నుంచి జీపు జాతా, కరపత్రాల పంపిణీ

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: అనంత రైతులకు పెట్టుబడి సాయంగా ఎకరాకు రూ.10వేలు చొప్పున ఇవ్వాలని, వారిని అన్ని విధాలా ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీపీఐ ఏపీ కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీశ్ డిమాండ్‌చేశారు. అనంతపురం జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ నీలం రాజశేఖరరెడ్డి భవన్‌లో ఆదివారం సీపీఐ అనుబంధం ఏపీ రైతు సంఘం జిల్లా సమితి విస్తృత స్థాయి సమావేశం రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గోవిందు అధ్యక్షతన నిర్వహించారు. జగదీశ్‌తో పాటు పార్టీ జిల్లా కార్యదర్శి జాఫర్, రైతుసంఘం జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు మల్లికార్జున, జిల్లా కార్యదర్శి చిన్నప్ప యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నాయకులు మాట్లాడుతూ రైతుల దయనీయ స్థితిని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ తరహాలో రెండు ఎకరాలున్న రైతుకు ఎకరాకు రూ.20వేల పెట్టుబడి సాయం ఇవ్వాలని, సాగు సాయంగా ఎకరాకు రూ.10వేల రూపాయలను ప్రతి రైతుకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు అన్ని రకాల సంక్షేమ ఫలాలు అందించాలని, రుణమాఫీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల సమస్యల పరిష్కారానికి ఎంతటి పోరాటాలకైనా వేనుకాడమన్నారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఈ నెల 26 నుంచి జులై 2వ తేదీ వరకు జీపు జాతా నిర్వహించి గ్రామగ్రామాన తిరిగి కరపత్రాలు పంపిణీ చేయాలని పిలుపునిచ్చారు. జులై 3న జిల్లా వ్యాప్తంగా గ్రామ సచివాలయాల వద్ద రైతులతో కలిసి ధర్నా నిర్వహించి, సచివాలయ కార్యదర్శులకు వినతులు అందజేయాలన్నారు. జులై 10, 11వ తేదీల్లో మండల కేంద్రాల్లో రైతులను సమీకరించి దీక్షలు నిర్వహించాలన్నారు. జులై 17,18,19 తేదీల్లో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో సాగుసాయం డిమాండ్ చేస్తూ రౌండ్ టేబుల్ ఏర్పాటు చేయాలని జిల్లా రైతు సంఘం కౌన్సిల్ సభ్యులకు పిలుపునిచ్చారు. జులై 26 నుంచి 30వ తేదీ వరకు విజయవాడ కేంద్రంగా సామూహిక దీక్షలు, జులై 31న నిరవధిక దీక్షలు నిర్వహించేలా ఏపీ రైతు సంఘం రాష్ట్ర సమితి పేర్కొందన్నారు. ప్రకృతి వైపరీత్యాలతో జరిగే నష్టాలకు నాలుగు వేల కోట్ల రూపాయలు కేటాయించాలని, రుణ మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులను సమీకరించి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు సమరశీల పోరాటాలు చేస్తామని నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు వన్నారెడ్డి, ఉపాధ్యక్షులు బండి రామకృష్ణ, గోపాల్, కౌన్సిల్ సభ్యులు మనోహర, రాము, మధు యాదవ్, చలపతి వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల వ్యవస్థలో సమూల మార్పులు అవసరం

జయప్రకాశ్ నారాయణ్

విశాలాంధ్ర-విజయనగరం: ఎన్నికల వ్యవస్థను సమూలంగా మార్చాల్సిన అవసరం ఉందని లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ్ అన్నారు. విజయనగరంలో జరిగిన కార్యక్రమంలో ఆయన 'ఓట్ ఇండియా సేవ్ డెమోక్రసీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల్లో అభ్యర్థులు ఇష్టానుసారంగా ఖర్చు పెడుతున్నారన్నారు. 2019లో బ్రిటన్ పార్లమెంట్ ఎన్నికల కన్నా తెలంగాణ ఎన్నికల ఖర్చు ఎక్కువైందని తెలిపారు. రాజకీయం ఒక ప్రహసనంగా మారిందన్నారు. పార్టీలు ప్రజలతో ఆడుకుంటు న్నాయన్నారు. చంద్రబాబు, జగన్‌లు వేలకోట్లకు అధిపతులని, గెలిచినా ఓడినా వారిద్దరు సంతోషంగానే ఉంటారన్నారు. ఎన్టీఆర్ అభివృద్ధి, సంక్షేమం రెండు సమానంగా చేశారని చెప్పారు. పాలకులు తమని తాము దానకర్ణులని భావిస్తు న్నారని, ప్రజలకు తాయిలాలిస్తే ఓట్లు వస్తాయని భావిస్తున్నారని అన్నారు. పేదరికాన్ని రూపుమాపే ప్రయత్నం చేయడం లేదని, ఎవరికి వారే తరతరాలు పాలిద్దామని అనుకుంటున్నారన్నారు. యాభై ఏళ్లుగా దేశమే ఊపిరిగా బతికానని చెప్పారు. కొంత మంది మేధావుల కృషి వల్ల కేంద్రం, రాష్ట్రానికి 10,461 కోట్లు విడుదల చేసిందని చెప్పారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

జగన్ పతనం తథ్యం : యనమల

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: పదవి తెచ్చిన అహం, డబ్బు గర్వంతో విర్రవీగుతున్న జగన్ పతనం తథ్యమని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు హెచ్చరించారు. జగన్ పాలనపై ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత ఉందని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికలు ఎప్పుడొస్తే అప్పుడు ఆయనను ఇంటికి పంపించాలనే కసి కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. ఇంతటి ప్రజావ్యతిరేకత ఉన్న సీఎం జగన్ ఒక్కరేనన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం మైనార్టీలంతా జగన్ బాధిత వర్గాలేనని యనమల అన్నారు. 'డా.సుధాకర్, డా.అచ్చెన్న, దోమతోటి విక్రమ్, అబ్దుల్ సలాం, మిస్బా, మంత్రూ బాయి వంటి ఎందరో ప్రాణాలను బలిగొన్నారు. శిరోముండనాలు చేశారు. భూములు ఆక్రమించారు. తోటలు నరికేశారు. ఇళ్లు ధ్వంసం చేశారు. గ్రామ బహిష్కారాలు చేశారు. సజీవ దహనాలకు తెగబడ్డారు. ఇదంతా 'సైలెంట్ రివల్యూషన్' (నిశ్శబ్ద విప్లవం)కు దారితీసింది. కేసుల భయంతో అంతా గుంభనంగా వ్యవహరిస్తున్నారు. ఏ కులంలోనూ, ఏ మతంలోనూ జగన్‌పై సానుభూతిలేదు. ప్రజల సానుభూతికి దూరం కావడం జగన్ స్వయంకృతమే. నాలుగేళ్లలో ఒక్క మంచి కార్యక్రమం లేదు. ఇంత విధ్వంసకాండ ఏ రాష్ట్రంలోనూ లేదు. గతంలో ఏ ముఖ్యమంత్రి రౌడీమూకలను పెంచిపోషించిన దాఖలాలు లేవు. లక్షల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ధ్వంసం చేశారు. అమరావతిలోనే రూ.2లక్షల కోట్ల సంపద ధ్వంసం చేశారు. పరిశ్రమలను తరిమేసి ప్రజల ఉసురు తీశారు. అటు అభివృద్ధి వినాశనం, ఇటు ఉపాధికి మంగళం.. మరోవైపు కూల్చివేతలు, హింసా విధ్వంసాలు. .నాలుగేళ్లుగా కట్టిందేమీలేదు, కూలగొట్టిందే అధికం. ఏ ప్రాజెక్టు పూర్తిచేయలేదు, పేదల ఇళ్లన్నీ గాలికి వదిలేశారు. అడుగడుగునా ఏపీలో జీవన విధ్వంసమే.. ఇలాంటి వినాశకారుడిని చరిత్ర క్షమించదు. రష్యాలో జరిగిన తిరుగుబాటు తరహాలోనే రాష్ట్రంలోనూ తప్పదు.. పుతిన్ పెట్టుకున్న గ్రూపే ఆయనపై తిరగబడింది. అలాగే జగన్ తయారుచేసిన మూకలే తిరుగుబాటు చేస్తాయి. ఇందుకు విశాఖలో వైసీపీ ఎంపీ కుటుంబం కిడ్నాపే నిదర్శనం. భస్మాసురుడి పరిస్థితి జగన్‌మోహన్ రెడ్డికి తప్పదు' అని యనమల హెచ్చరించారు.

కుటుంబంలో చిచ్చురేపిన మద్యం

విశాలాంధ్ర- వెలుగోడు: మద్యానికి బానిసైన కొడుకును ఓ తండ్రి కడతేర్చిన ఘటన కర్నూలు జిల్లా వెలుగోడులో చోటుచేసుకుంది. స్థానిక ఎస్సీ కాలనీ లో మారెమ్మ గుడి వద్ద నారాయణ అనే వ్యక్తి నివసిస్తున్నాడు. అతని కుమారుడు రామకృష్ణ (35)నిత్యం తాగి వచ్చి తల్లిదండ్రులతో , భార్య తో గొడవ పడేవాడు. అతని వేధింపులు తాళలేక విసుగు చెందేవారు. ఆదివారం తెల్లవారుజామున కూడా ఇంట్లో గొడవ జరిగింది. దీంతో కోపం పట్టలేక తండ్రి నారాయణ రామకృష్ణ తలపై రోకలితో కొట్టాడు. ఆ దెబ్బకు రామకృష్ణ అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ జగన్‌మోహన్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అర్హులైన కాంట్రాక్టు ఉద్యోగులందర్నీ క్రమబద్ధీకరించాలి

విశాలాంధ్ర-విజయవాడ: అర్హతున్న కాంట్రాక్టు ఉద్యోగులందరినీ ప్రభుత్వం బేషరతుగా క్రమబద్ధీకరించాలని ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్టు పారామెడికల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జీవీవీ ప్రసాద్ కోరారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేస్తూ లేఖ రాశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఏళ్ల నాటి కాంట్రాక్టు భూతాన్ని ఇన్నాళ్లకైనా వదిలిం చేందుకు ముందుకొచ్చిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని అభినందిస్తూనే, ఈ వ్యవహారంలో జరుగుతున్న లోటుపాట్లను సీఎం దృష్టికి తీసుకెళ్లి అర్హులందరికీ మంచి జరిగే ప్రయత్నం చేస్తున్నామని ప్రసాద్ వివరించారు. వైసీపీ హామీ మేరకు అన్ని శాఖల్లో ఉన్న కాంట్రాక్టు ఉద్యోగుల అర్హత, సర్వీస్ పరిగణనలోకి తీసుకొని వీలైనంత ఎక్కువ మందిని రెగ్యులర్ చేస్తాం అని జగన్ స్వయంగా మాటిచ్చిన సంగతిని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఎందరో సచివాలయ ఉద్యోగులను ఒక్కసారిగా రెగ్యులర్ చేసిన ముఖ్యమంత్రి... అదే విధానంలో కొందరే కాంట్రాక్టు ఉద్యోగులను, అందులో అర్హులైన వారందరినీ రెగ్యులర్ చేయాలని కోరారు.

వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల పరిస్థితి ఛిన్నం

అన్ని ప్రభుత్వ శాఖల్లోని కాంట్రాక్టు ఉద్యోగుల కన్నా వైద్య ఆరోగ్యశాఖలోని కాంట్రాక్టు ఉద్యోగుల పరిస్థితి అత్యంత దయనీయమైనదని ప్రసాద్ పేర్కొన్నారు. ముఖ్యంగా, 2002 డీఎస్సీ పారామెడికల్ రిక్రూట్‌మెంట్ కోసం పేపర్ నోటిఫికేషన్, రాత పరీక్ష , రూల్ ఆఫ్ రిజర్వేషన్, ఆర్డర్ ఆఫ్ మెరిట్, క్లియర్ వేకన్సీ, శాంక్షన్డ్ పోస్టులందు ప్రభుత్వ నియమ నిబంధనలు అనుసరించి నియామకాలు పొందిన అర్హులైన వారందరికీ ఇప్పుడు రెగ్యులర్ ఫలాలు దక్కకుండా పోతుండటం బాధాకరం అన్నారు. 2002 డీఎస్సీ ద్వారా విధులు నిర్వహిస్తున్న ప్రతి ఒక్క మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ (మేల్), మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ఫీమేల్)(ఏఎన్ఎం) ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు ను రెగ్యులర్ చేయడం ప్రభుత్వ కనీస బాధ్యతన్నారు. సహేతుక సాంకేతిక కారణాలతో తక్షణం రెగ్యులర్ చేయలేని వారిని, దశలవారీగా రెగ్యులర్ చేస్తామన్న ప్రభుత్వ పెద్దల మాటల ప్రకారం ప్రభుత్వం విడుదల చేసే ప్రభుత్వ ఉత్తర్వులో టైమ్ షెడ్యూల్ ప్రకటించాలన్నారు. ఏ కారణంతోనైనా ఇప్పుడు రెగ్యులర్ చేయలేకపోయిన కాంట్రాక్టు ఉద్యోగులకు తగిన విధంగా న్యాయం చేయాలని ప్రసాద్ కోరారు. కాంట్రాక్టు ఉద్యోగంలో ఉండి మరణించిన కుటుంబాలను ఆదుకోవడానికి 20 లక్షల రూపాయలు ఏక్సగ్రేషియో ఇవ్వాలని, అలాగే కుటుంబ సభ్యుల్లో ఒకరికి కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగం ఇవ్వాలని, అన్ని అర్హతలు ఉన్న డీఎస్సీ కాంట్రాక్టు ఉద్యోగులందరిని బేషరతుగా రెగ్యులర్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

కర్నూలు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

విశాలాంధ్ర-కోడుమూరు: రెక్కాడితే గానీ డొక్కాడని వ్యవసాయ కూలీలకు ఏటా దూర ప్రాంతాలకు వలసలు వెళ్లడం తప్పడం లేదు. తాజాగా కర్నూలు జిల్లా హోలగుంద మండలం కొత్తపేట, హెబ్బటం, కురుకుంద గ్రామాల నుంచి వలస వెళ్తున్న ముగ్గురు కూలీలు రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, మరికొందరు తీవ్ర గాయాలై ఆసుపత్రి పాలయ్యారు. కోడుమూరు ఎస్సై ఎ.శ్రీనివాసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి...హోలగుంద మండలంలోని కొత్తపేట,హెబ్బటం,కురుకుంద గ్రామాల నుంచి 14మంది శనివారం రాత్రి తెలంగాణ ప్రాంతానికి బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న బొలెరో వాహనం కోడుమూరు దగ్గరకు చేరుకోగానే కర్నూలు రహదారిపై స్థానిక హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద కర్నూలు వైపు నుంచి ఎదురుగా వస్తున్న మినీలారీ ఢీ కొట్టింది. దీంతో బొలెరోలో ప్రయాణిస్తున్న వారిలో బోయ ముత్తయ్య (33)బలాదూర్ మల్లయ్య(35)లు అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్ర గాయాల పాలైన వాహనం డ్రైవర్ వీరేష్(40) కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అలాగే నీలకంఠ నాయక్,బోయ అంపయ్య, బోయ రంగయ్య, బోయ వీరన్న, బోయ ప్రసాద్, బోయ రాముడు, బోయ వీరన్న, బోయ బుడ్డప్ప, బోయ మహేష్, గాదిలింగ, వీరేష్ అనే 11మంది గాయాల పాలయ్యారు.

సాహితి

త్రిపురనేని హేతువాద సాహిత్యం

డా॥ కత్తి పద్మారావు

తెలుగు సాహిత్యంలో హేతువాద భావజాలం వేమన నుంచి బలంగా ప్రారంభమైంది. వేమన గొప్ప హేతువాద కవి. వేమన గురజాడకు, శ్రీశ్రీకి, చెరబండ రాజుకు మార్గదర్శకుడయ్యాడు. వేమన మార్గంలో హేతువాదాన్ని బలంగా తీసుకెళ్ళిన వాళ్ళు త్రిపురనేని రామస్వామి చౌదరి, తాపీ ధర్మారావు, మహాకవి గుఱ్ఱం జాషువా, శ్రీశ్రీ, ఆరుద్ర, సి.వి. కూడా హేతువాద భావజాలాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్ళారు. హేతువాద భావజాలాన్ని ప్రచారం చేసిన వాళ్ళే కవులుగా, మహాకవులుగా ముందు కొచ్చారు. కవిత్వం కవిత్వం కోసం కాకుండా సమాజహితం కోసం, మానవాభ్యుదయం కోసం, మానవతా స్ఫూర్తి కోసం, సమసమాజ నిర్మాణం కోసం రాసిన హేతువాదులు తెలుగు సాహిత్యంలో బలంగా వున్నారు. త్రిపురనేని రామస్వామి చౌదరి సూత పురాణం, శంభూకవధ వంటి అనేక గ్రంథాల్లో దేవుళ్ళ పుట్టుపూర్వోత్తరాలను కళ్ళకు కట్టారు. "మల మల లాడు పొట్ట తెగమాసిన బట్ట కలంత బెట్టగా విల విల ఏడ్చుచున్న నిరుపేదకు జాలిని చూపుతున్న...

"మల మల మాడు పొట్ట. తెగమాసిన బట్ట కలంత పెట్టగా
విల విల యేడ్చుచున్న నిరుపేదకు జాలిని జూపకుండ, సు
త్తల పడిపోయి జీవరహితంబగు బొమ్మకు నిండ్లు వాకిళుల్
పొలమును బోర్రనిచ్చెడి ప్రబుద్ధ వదాన్యు నిచ్చమెచ్చెదన్"

హేతువాద భావజాలం

దేవుళ్ళకు పెద్ద పెద్ద దేవాలయాలు నిర్మిస్తున్నారు. పట్టు వస్త్రధారణ చేస్తున్నారు. వజ్ర వైఢూర్యాలతో అలంకరిస్తున్నారు. కానీ నిరుపేద పొట్టకు అన్నం కరువైంది. పేదలేమో మసిబట్టలతో వున్నారు. దేవతా విగ్రహాలేమో పట్టు పీతాంబరాలతో వెలిగి పోతున్నాయి. రాళ్ళను పూజించే వాళ్ళు చక్ర పొంగలి ఆరగిస్తున్నారు. రాళ్ళుకొట్టే వాళ్ళకేమో గంజిబువ్వ కూడా దొరకడం లేదు. ఈ వైరుధ్యాలను త్రిపురనేని రామస్వామి చౌదరి అలతి అలతి పదాలతో ఉత్పలమాలతో అద్భుతంగా చెప్పాడు. త్రిపురనేని రామస్వామి చౌదరి బ్రాహ్మణవాద భావజాలం మీద గొప్ప తిరుగుబాటు చేశాడు. రాముడికి 10 తలలు అంటే దశగ్రీవుడు అన్నాడు. కోయభాషలో దశగ్రీవ అంటే అర్థం కవిరాజు ఇలా చెప్పారు. దస అనగా బాధ. గీవ అంటే కలుగజేయువాడు అని అర్థం చెప్పాడు. రాక్షసుడు అంటే రక్షించువారు అని అర్థం చెప్పాడు. రావణుడు గొప్ప పండితుడు. గొప్ప రాజు. ఆయన్ని చంపడం అనేది కథకి ఒక పెద్ద గ్రంథం ఎందుకు రాయాల్సివచ్చింది. అని ఆయన ప్రశ్నించాడు. కోయ, చెంచు మొదలగు జాతులు చింత తోపుల్లోనూ, చెట్టు పుట్టలలోనూ, అడవుల్లో జీవిస్తూ రాత్రులు బలంగా వుంటారు. తమ బిడ్డలను రక్షించుకునే రక్షకులుగా వుంటారు. అందుకే వీళ్ళను రాక్షసులు అన్నారు అని చెప్పారు. మూల వాసులకు వ్యతిరేకమైన నామవాచకాలు పెట్టి వారిని అన్ పాపులర్ చేయడానికి చూసింది బ్రాహ్మణ సమాజం.



తెలుగులో హేతువాద సాహిత్యం అష్టాదశ పురాణాలను తిరగదోడింది. హేతువాద కవులు ముఖ్యంగా త్రిపురనేని రామస్వామి చౌదరి, గుర్రం జాషువా మహాకవి, తాపీ ధర్మారావు, ఆరుద్ర వంటి వారంతా మూఢ విశ్వాసాల మీద కొరడా ఝుళిపించారు. హేతువాద సాహిత్యం తెలుగు సాహిత్యానికి జీవ గర్ర ఎన్నో కొత్త విషయాలను బయటకు తీసుకొచ్చింది. తెలుగు వారు ఒకదశలో భారత రామాయణ భాగవతాలను గుడ్డిగా నమ్మారు. ముఖ్యంగా సినిమాల ద్వారా, నాటకాల ద్వారా, హరికథల ద్వారా, బుర్రకథల ద్వారా, ఈ కథలు ప్రచార మయ్యాయి. వాటిని హేతువాద నాస్తిక కవులు, రచయితలు తిప్పికొట్టారు. ఈ గ్రంథాలని హేతువాద దృక్పథంతో చూశారు. ముఖ్యంగా రామాయణంలో శంబుఖ వధ త్రిపురనేని రామస్వామి చౌదరి గట్టిగా ప్రశ్నించారు. ఒక శూద్రుడు చదువుతుంటే రాముడు తలనరకడం ఏమిటి అనేది ఆయన ప్రశ్న. ఆయన పురోహితుల దోపిడిని కూడా నిలదీశారు. కవిరాజు శంబుకవధ పురాణ సాహిత్యం మీద తిరుగుబాటు జెండాను ఎగురవేసింది. అవతార పురుషుల అఘాయిత్యాలను, దాడులను, హింసలను కవిరాజు నిర్భయముగా ఎత్తి చూపాడు. శంబుకుని చంపడం ఒక మహాత్కార్యముగా ఆర్ష సాహిత్యం వర్ణిస్తే శంబూకుని వధ ఒక హింసాకాండగా కవిరాజు వర్ణించాడు. శ్రీరాముడి క్రౌర్యం, బ్రాహ్మణవాద పరిరక్షణం ఈ నాటకంలో స్పష్టంగా అభివ్యక్తమయింది. శ్రీ కొత్త సత్యనారాయణ చౌదరి కవిరాజు శంబూకవధను గూర్చి వివరిస్తూ...

త్రిపురనేని హేతువాద విశ్లేషణ

"ఈ ఘట్టములో శ్రీరాముడు చేసినది చెడ్డయని 'శంబుకవధ'లో కవి నిరూపించెను. అది సత్యమైనను గొబ్బిదాటుగా గొందఱుకుంది. రామ రామ యని చెవులు మూసికొనిరి. అవతార మూర్తికి అపనిందలు అంటగట్టిన రామస్వామి చౌదరికి రౌరవాది నరకముఓ స్థలమేర్పఱిచిరి. ఈ గాలికూతలకు శాపనార్థములకు లొంగువాడుకాడు ఈ కవిరాజు. శంబూకుని కథలో స్పష్టమైన హైందవ మతములోని కుళ్ళును వెళ్లడించడంలో కవిరాజు చేసిన పరిశ్రమ - చూపిన ఆవేదన ఇంతయని చెప్పలేము. ఈ నాటకములో బీజ ప్రాయముగా గర్భితమైయున్న 'ఆర్య - ద్రావిడ భేదం గాథలే, తరువాత వచ్చిన సూత పురాణాలలో సమగ్ర స్వరూపము చెందినవి. రామాయణ భారత గాథలను గూర్చి కవిరాజు ప్రారంభించిన ఉద్యమము ఆదిలో దృశ్య కావ్యములలో ఆవిర్భవించి ఆవల, శ్రవ్యకావ్యములో 'విశ్వరూపము' దాల్చినది." తమిళ కన్నడ సాహిత్యాల్లో కూడా కవిరాజు తీసుకువచ్చినంత తీవ్రమైన విమర్శ మరొకరు తేలేకపోయారు. శంబూకుడు శూద్రుడు. శూద్రుడెందుకు వేదం చదవకూడదు. వేదాల్లో ఆర్యుల గుట్టువుంది. ఆ గుట్టురట్టవుతుందని ఈ నిషేధం. ఏమిటాగుట్టు? ఆర్యులు అనార్యులను హింసించటం, వధించటం, మానభంగాలు చేయటం. ఈ వేదాలు శూద్రులు చదివినట్లయితే ఆర్యులు భారత భూభాగంపై ఎలా దండయాత్రలు చేశారో ఇక్కడున్న జాతులను ఏ విధంగా వర్ణ బేధంతో, విభజించారో యివన్ని అర్థమవుతాయని వేదాలు చదవడం నిషేధించారు. అందుకే శ్రీరాముడు ఆర్య సంస్కృతిని కాపాడటంలో భాగంగా శంబూకుడ్ని వధించాడు. దీన్ని నాటకంగా మలిచి త్రిపురనేని రామస్వామి నూత్న సాహితీ సంపత్తిని భావవిప్లవ వాదులకు చేకూర్చారనడంలో అతిశయోక్తి లేదు.

శంబుక వధ హేతువాద విశ్లేషణ

శంబుక వధ పీఠికలో అనార్యుల జీవన విధానాలను గురించి చాలా వివరాలిచ్చారు. అప్పటికీ పురాణాంశాలను చారిత్రకాన్వయాలతో పరిశీలించిన వారిలో ఆయన ప్రసిద్ధుడు. శంబుక వధ మీద బ్రాహ్మణ వాదులు తీవ్రమైన దాడులు చేశారు. నిందాభూయిష్టమైన విమర్శతో కవిరాజును అవమానించాలని చూశారు. కాని ఆయన అనార్యుల గురించి యిచ్చిన వివరణ వాస్తవాంశా సముచ్ఛయంగా, మరీ ముఖ్యంగా ద్రావిడులను గూర్చి ఆయన ఈ విధంగా వ్యాఖ్యానించారు.

సంస్కృతాన్ని బ్రాహ్మణేతరులు బాగా అధ్యయనం చేశారు. గొప్ప గొప్ప ఋషులుగా పేరుపొందిన వాళ్ళకు ఎందుకు గోత్రాలులేవు అని ప్రశ్నించారు. పుట్టుకనుబట్టి బ్రాహ్మణత్వమే కాదు అని వాదించారు. బ్రాహ్మణత్వమే ఒక అభూత కల్పన అని నిలదీశారు. అయితే అందరం బ్రాహ్మణులం కావాలి లేకుంటే అందరం శూద్రులు కావాలని వాదించారు. అంతేకాదు మొత్తం జంధ్య ధారణకు ఉపక్రమించారు. గోత్ర నామాలన్ని రూపకల్పన చేసినవే అని వ్యాఖ్యానించారు. అక్షరం అభ్యసించ దానికి ఆంక్షలు ఎందుకు అని ప్రశ్నించారు. మానవతా ప్రబోధం కోసం తమ కులాన్ని కూడా అవసరం అయితే వదులుకుంటామని కొత్త ధర్మాన్ని కూడా తీసుకొచ్చారు. బ్రాహ్మణేతరులలో పండితులు పదును గలిగినవారు. అప్పటి వరకు పురాణాలు చూసిన కోణానికి భిన్నంగా చూశారు. త్రిపురనేని రామస్వామి చౌదరి హేతువాద సాహిత్యం ఈనాటి సమాజానికి ఎంతో భావోజ్వలం కలిగిస్తుంది. మత, ఛాందస భావాల నుంచి బయటపడి పురాణ సాహిత్యాన్ని హేతుదృష్టితో చూడగలిగిన చూపునిస్తుంది. తప్పక ప్రతి తెలుగు వాళ్ళు త్రిపురనేని రామస్వామి చౌదరి సాహిత్యం అధ్యయనం చేయాల్సిన చారిత్రక సందర్భం ఇది.

సామాజిక తత్త్వవేత్త, ఫోన్ : 9849741695

అరసం బహుమతి పొందిన కవితలు-2023

అసమానతల భారతమా

-కోనేటి నరేష్
సెల్:8499847863

పరితపిస్తోంది నాదేశం..
పరిణామం కోసమని..
పాలకోసం పసిపిల్లలు ఏడుస్తున్న నాదేశంలో
పుట్టలోని పాములకు
పాలు పోస్తోంది నాదేశం...

నాదేశంలో..అంతస్థుల్లో ఒకడు
ఆకాశాన్ని తాకుతుంటే
అసమానతలతో మరొకడు
అట్టడుగునే మిగిలిపాయే
అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న నా దేశం..
అవినీతిలో మాత్రం ముందుండె...

నా దేశంలో.. పార్టీల జెండాలు వేరైనా
వాటి ఎజెండా ఒక్కటే...ప్రజలను దోచుకోవడమే..
కార్మికుడి కష్టాన్ని దోచుకొనే కంపెనీలు...
కర్షకుడి కడుపుకొట్టే ప్రభుత్వాలు...
ప్రజా ధనాన్ని కలుగుల్లో ఎలుకల్లా
మేస్తున్న నాయకుల తీరు మారేదెప్పుడో...

నా దేశంలో..పాతిక సంవత్సరాల

వయస్సున్న యువత నిద్రపోతుంటే
పండు ముసలి నాయకులు
నా దేశాన్ని పాలిస్తుంటే...
ఈ యువతరం మేల్కొనేదెప్పుడో...
ప్రశ్నించేదెప్పుడో...పాలించేదెప్పుడో...

నా దేశలో...కాశ్మీరులో కల్లోలాలు
అస్సాములో అలజడులు
పంజాబులో మత్తుపదార్థాలు
ముంబయిలో మురికివాడ జీవితాలు మారేదెప్పుడో...

డెబ్బైఐదేళ్ల నా స్వతంత్ర భారతమా...
స్వాతంత్ర్య ఉద్యమ లక్ష్యాల
ఆశయాలను సాధించేదెప్పుడో...
అసమానతలు తొలిగేదెప్పుడో...
అభివృద్ధి సాధించేదెప్పుడో...
వాటి ఫలాలు పేదలకు చేరేదెప్పుడో...
సామాన్యుడి జీవితం మారేదెప్పుడో...

(అరసం యువ వచన కవితా పోటీలు-2023 లో కన్సొలేషన్ బహుమతి పొందిన కవిత.)

ప్రమిద రావి రంగారావు సాహిత్య స్వర్ణోత్సవ సంచిక

ప్రమిద మాస పత్రిక ప్రధాన సంపాదకుడు బులుసు వెంకట కామేశ్వరరావు సంపాదకీయంలో వెలువడిన రావి రంగారావు సాహిత్య స్వర్ణోత్సవ సంచిక. ఈ సంచికలో మినీ కవితోద్యమ సారథి అయిన రావి రంగారావు కవితా జీవనం గురించి, కవితా ఉద్యమాల గురించి అనేక మంది ప్రముఖుల అభిప్రాయాలు, వారి అనుభవాలతో ఒక ప్రత్యేక సంచికను తీసుకొచ్చారు ప్రమిద మాసపత్రిక సంపాదకులు.

పద్య కవిత్వం, భావ కవిత్వం, వచన కవిత్వం వంటివి అనేకం ఉన్నాయని కవిత్వాన్ని రాసి అనేక మంది చేత రాయించిన కవితా ఉద్యమకారుడు రావి రంగారావు ఆయన రాసిన అగ్గిపెట్టె, రేజర్‌లో సూర్యుడు, ముఖం పుల్ల, సూర్యరసం, రావి శతకం వంటివి కాక కుంకుడు కాయ కవిత ద్వారా ఎందరి మనస్సులలో నిలిచిపోయారు. ఆయన బందరులో ఉన్నంతకాలం సాహితీ మిత్రులు పేరిట నెలకు ఒక సమావేశం ఏర్పాటు చేసి ఎందరో కవులను ప్రోత్సహించిన ఆయన గుంటూరుకు వెళ్లిన తరువాత అమరావతి సాహితీ మిత్రుల పేరుతో కవితా సేవ చేస్తున్నారు. రావిరంగారావు కవితా సంకలనాలపై ప్రముఖుల అభిప్రాయాలను తెలుసుకోవాలంటే రావి రంగారావు సాహిత్య స్వర్ణోత్సవ సంచిక చదవాల్సిందే.

విష్ణుభొట్ల రామకృష్ణ, సెల్: 9440618122



ప్రమిద, రావిరంగారావు సాహిత్య స్వర్ణోత్సవ సంచిక,
వెల: రూ. 50/- సంపాదకులు: ప్రమిద మాసపత్రిక
ప్రధాన సంపాదకులు బులుసు వెంకట కామేశ్వరరావు,
పేజీలు: 191, ప్రతులకు: ప్రమిద మాసపత్రిక, 101-వసుంధర ఎన్‌క్లేవ్,
నారాయణపురం, ఈడేపల్లి, మచిలీపట్నం, సెల్: 9885459193.

మంచి పుస్తకం

మొగల్ చరిత్రపై మరో చూపు

చరిత్ర ఊహాజనితం కాదు. కాల్పనిక గాథ చరిత్ర కాదు. గతాన్ని, చారిత్రక వ్యక్తులను వారు జీవించిన సమయంలోని పరిస్థితుల ఆధారంగా అంచనా వేయాలే తప్ప ప్రస్తుత పరిస్థితి ఆధారంగా చరిత్ర నిర్మించడానికి ప్రయత్నం చేయకూడదు. రాచరిక యుగం నాటి పరిణామాలను ప్రజాస్వామ్య ప్రమాణాలతో అంచనావేస్తే వాస్తవం మరుగున పడుతుంది. మన దేశాన్ని పరిపాలించిన అనేక మంది రాజులు చరిత్రలో నిలిచి పోయారు. మంచి చేసిన వారితో పాటు చెడు చేసిన వారిని కూడా జనం గుర్తుంచుకుంటారు. వారు చేసింది మంచో చెడో నిర్ణయించాల్సింది వారు జీవించిన కాలాన్నిబట్టే తప్ప ఈ నాటి ప్రమాణాలతో కాదు.

మొగల్ చక్రవర్తి ఔరంగజేబ్ (1618-1707) దుష్ట పరిపాలకుడిగ జనం మదిలో నిలిచిపోయారు. ఢిల్లీలోని ఔరంగజేబ్ రోడ్ పేరు ఇటీవల ఎ.పి.జె.అబ్దుల్ కలాం రోడ్డుగా మార్చారు. ఇది చారిత్రక పొరపాట్లను చక్కదిద్దడంగా భావిస్తున్నారు. ఔరంగజేబ్ ఆ రోజుల్లో ప్రపంచంలోకెల్లా సంపన్నుడు. అత్యంత శక్తిమంతుడైన రాజు. ఆయన 1658 నుంచి 1707 దాకా అంటే దాదాపు అర్థ శతాబ్దంపాటు రాజ్యమేలారు. ఆయన ఏలుబడిలో ఉన్న రాజ్యం దక్షిణాసియాలో అన్నింటికన్నా పెద్దది. ప్రస్తుత యూరప్ అంతటికన్నా విశాలమైంది. ఆయన ఏలుబడి గురించి, వ్యక్తిత్వం గురించి ఇప్పటికీ చర్చ జరుగుతూనే ఉంది. అయితే జనం మదిలో ఆయన అత్యంత క్రూరుడైన పరిపాలకుడు. హిందూ మతాన్ని, సంస్కృతిని తుడిచిపెట్టాలను కున్న రాజు. ఔరంగజేబ్ మీద చాలా తీవ్రమైన ఆరోపణలున్నాయి. ఆయన వేలాది హిందూ దేవాలయాలను ధ్వంసం చేశాడని, లక్షలాది మంది హిందువులను బలవంతాన ఇస్లాం మతం స్వీకరించడానికి బలవంత పెట్టాడని, హిందువులమీద మారణకాండ కొనసాగించాడని, హిందువులను, హిందూ మతాన్ని రూపుమాపాలనుకున్నాడని అనేక ఆరోపణలున్నాయి. ఇవన్నీ నిజమే అయితే అది దిగ్భ్రాంతికరమైందే.

అమెరికాకు చెందిన చరిత్రకారిణి ఆడ్రే ట్రష్కి ఈ ఆరోపణల నిగ్గు తేల్చడానికి "ఔరంగజేబ్: ది మాన్ అండ్ ది మిత్" గ్రంథం రాశారు. 2017లో పెంగ్విన్ రాండం హౌజ్ ఇండియా ఈ గ్రంథాన్ని ప్రచురించింది. ట్రష్కీ న్యూ జెర్సీలోని రూట్జర్స్ యూనివర్సిటీలో చరిత్ర బోధించే అసిస్టెంట్ ప్రొఫెసర్. నెవార్క్ లోని ఈ యూనివర్సిటీలో ఆమె దక్షిణాసియా చరిత్ర బోధిస్తారు. ఈ గ్రంథం రాయడానికన్నా ముందు ట్రష్కి "కల్చర్ ఆఫ్ ఎంకౌంటర్స్: సాన్స్ క్రిట్ అట్ ది మొగల్ కోర్ట్" గ్రంథం రాశారు. ఇదీ పెంగ్విన్ ప్రచురణే. ఔరంగజేబ్ రోడ్ పేరు మార్చాలని మొట్టమొదట కోరింది స్థానిక సిక్కులు. ఔరంగజేబ్ నిరంకుశుడు, అమానుషమైన రీతిలో వ్యవహరించిన వాడు కనక ఆ రోడ్డు పేరు మార్చాలన్నారు. ఆ తర్వాత పార్లమెంటులో కొంతమంది బీజేపీ సభ్యులు ఈ వాదనను బలపరిచారు. 2015 ఆగస్టులో ఢిల్లీ అధికారులు ఆ రోడ్డు పేరు ఎ.పి.జె. అబ్దుల్ కలాం రోడ్డుగా మార్చారు. ఔరంగజేబ్ దుష్ట పాలకుడైతే ఆయనను స్మృతిపథం లోంచి చెరిపేయడానికి ప్రయత్నించాలి తప్ప ఆయనను మరో సారి గుర్తు చేసే పనులు చేసి ఉండవలసింది కాదు. ఆ తర్వాత పార్లమెంటులో శివ సేన సభ్యుడొకరు మునిసిపల్ కార్పొరేషన్ అధికారులను "ఔరగజేబ్ కి ఔలాద్" (సంతతి) అని దూషించారు. అయోధ్య రగడ తారస్థాయిలో ఉన్నప్పుడు భారతీయ ముస్లింలను బాబర్ కి ఔలాద్ అనే వారు అని ట్రష్కి గుర్తు చేస్తారు.

ఔరంగజేబ్ మీద ఆగ్రహం సంఘ్ పరివార్ కు మాత్రమే పరిమితమైంది కాదు. ఇతర వర్గాల్లోనూ ఇదే అభిప్రాయం ఉంది. పాకిస్తాన్ లోనూ ఇదే వరస. ఔరంగజేబ్ తన అన్న దారా షికో మీద విజయం సాధించడంతోనే దేశ విభజనకు బీజాలు పడ్డాయని షాహిద్ నదీం అనే పాకిస్తానీ నాటక రచయిత అన్నారని ట్రష్కి అంటారు. ముస్లింలను అనుమాన దృష్టితో చూసే వైఖరి 20వ శతాబ్దంలో గొప్ప చరిత్రకారులనుకునే జాదూ నాథ్ సర్కార్ వంటి వారికి కూడా ఉంది. "మహమ్మదీయుల మత విశ్వాసమే నిరంకుశత్వంతో కూడుకున్నది" అని 1772లోనే అలెక్జాండర్ డోవ్ అన్నారు.

"ఏ యుద్ధం ఎందుకు జరిగెనో?/ఏ రాజ్యం ఎన్నాళ్లుందో?
తారీఖులు, దస్తావేజులు/ఇవి కావోయ్ చరిత్రకర్థం
ఈ రాణీ ప్రేమ పురాణం/ఆ ముట్టడికైన ఖర్చులూ
మతలబులూ, ఖైఫీయతులూ/ఇవి కావోయ్ చరిత్ర సారం" అన్నారు శ్రీ శ్రీ. కాని బ్రిటిష్ వారి హయాంలో రాసిన చరిత్ర అంతా వీటికే పరిమితమైంది. చారిత్రికాధారాలకు విలువ ఇవ్వకుండా విద్వేషాలను రెచ్చగొట్టే అంశాలే చరిత్రగా చెలామణి అయాయి. అందుకే మొగలుల చరిత్రపై మరో చూపు చూడడానికి ట్రష్కి మౌలిక ఆధారాలను పరిశీలించి వాస్తవాన్వేషణకు ఉపక్రమించారు. మౌలిక ఆధారాలను వెతకడానికి ఆమె సంస్కృతం, పర్షియన్ భాషలు నేర్చుకున్నారు. ఆమె చేసిన పరిశోధనవల్ల ఔరంగజేబ్ మీద ఉన్న అనేక ఆరోపణలు నిరాధారమైనవని తేలిందంటారు ట్రష్కి. ఔరంగజేబ్ మీద ఏహ్య భావం ఉండడానికి గత చరిత్ర కారణం కాదు, భారత్‌లోని వర్తమాన పరిస్థితే ప్రధాన కారణం అంటారు ఆమె. ముస్లిం పాలకులు భారత్ ను నాశనం చేసి హిందువులను అణచి వేశారన్న అభిప్రాయం గూడు కట్టుకున్నందువల్లే ముస్లింలను ఔరంగజేబ్ సంతతిగా భావిస్తున్నారు. ఔరంగజేబ్ పాలన మంచిదా, చెడ్డదా అని తేల్చడానికి ఆధునిక, సమానత్వ, ప్రజాస్వామ్య కొలమానాలు పనికి రావు. ఆయన ప్రవర్తనకు ఆ నాటి పరిస్థితులే కారణం తప్ప వర్తమానం నాటి పరిస్థితినిబట్టి బేరీజు వేయడం చరిత్రను అర్థం చేసుకోవడానికి ఉపకరించేది కాదు.

హిందూ మతాన్ని, హిందువులను తుడిచిపెట్టడానికి ఔరంగజేబ్ ప్రయత్నించారనడానికి చారిత్రక ఆధారాలు లేవనీ అయితే ఆయన హిందువుల దేవాలయాలను కూల్చేయలేదని కాదు. ప్రచారంలో ఉన్నట్టుగా ఆయన వేలాది దేవాలయాలను ధ్వంసం చేయలేదు. మహా అయితే కొన్ని డజన్ల హిందూ ద్వేవాలయాలను ధ్వంసం చేసి ఉంటారు. హిందూ మతంలోని భిన్న శాఖల వారు ఇతర శాఖలకు చెందిన దేవాలయాలను ధ్వంసం చేసిన ఉదంతాలు మొగలులు మన దేశంలో కాలు మోపక ముందే ఉన్నాయి. బౌద్ధారామాలు, శివాలయాలుగా, శివాలయాలు వైష్ణవాలయాలుగా మారిన సందర్భాలూ ఉన్నాయి. ఇవన్నీ ఆయా మతాల విస్తరణలో భాగంగా జరిగినవే. ఈ విధ్వంస కాండ హిందువులే కొనసాగించినందువల్ల అంతగా పట్టించుకోకపోయి ఉండవచ్చు. భారీ ఎత్తున మత మార్పుడులను ఔరంగజేబ్ ప్రోత్సహించలేదని ఆయన ఏలుబడిలో ఇస్లాం మతం స్వీకరించిన వారు తక్కువ అంటారు ట్రష్కి. ఔరంగజేబ్ పాలనా కాలమంతా యుద్ధాలతోనే గడిచింది. ఆయన కాలంలోనే మొగల్ సామ్రాజ్యం విపరీతంగా విస్తరించింది. ఈ యుద్ధాల్లో ఆయన అనేక మందిని అంతమొందించిన మాట నిజం. సోదరులందరినీ మట్టుబెట్టాడు. హిందువుల మీద దాడి చేసినట్టే ముస్లింల మీద కూడా దాడి చేశాడు. ఔరంగజేబ్ ను క్రూరుడుగా చిత్రించడానికి ప్రయత్నించే వారు ఆయన హిందూ, జైన దేవాలయాలకు సహాయం చేసిన అంశాన్ని విస్మరిస్తారు. భారత శిక్షా స్మృతిలోని 295(ఎ) సెక్షన్ ఉద్దేశపూర్వకంగా మత భావాలను అవమానించడాన్ని నేరంగా పరిగణిస్తారు. ఒక మతం వారి భావాలను కించపరిచే అంశాలు చారిత్రక సత్యాలైనా భారత చట్టాలు దాన్ని నేరంగా పరిగణిస్తాయి. వెండీ డోనిగర్ రాసిన "ది హిందూస్: ఆన్ ఆల్టర్నేటివ్ హిస్టరీ" 2009లో వైకింగ్/పెంగ్విన్ ప్రచురించినప్పుడు పెద్ద దుమారం చెలరేగింది. పెంగ్విన్ ఈ గ్రంథాన్ని ఉపసంహరించుకుంది కూడా. ఆమె మీద కేసు కూడా నమోదైంది. చివరకు కోర్టు వెలుపల రాజీ కుదిరింది. పెంగ్విన్ ఈ పుస్తకాలను ఉపసంహరించుకోవడాన్ని అరుంధతీ రాయ్, పార్థా చటర్జీ, జీత్ తాయిల్, నామ్వర్ సింగ్ లాంటి వారు దుయ్యబట్టారు. ఆ తర్వాత ఈ గ్రంథాన్ని స్పీకింగ్ టైగర్ బుక్స్ భారత్ లో ప్రచురించింది. డోనిగర్ కూడా న్యూ యార్క్ లో నివసిస్తూ భారత్ చరిత్ర, సంస్కృతి పరిశోధకురాలుగా ఉన్నారు. ఆడ్రే ట్రష్కి కూడా ఔరంగజేబ్ పుస్తకంలో శివాజీకి సంబంధించిన అధ్యాయంలో కొంత భాగాన్ని ఉపసంహరించుకోవలసి వచ్చింది.

సంస్కృత, పర్షియన్ సాహిత్యంలో మౌలిక ఆధారాలను పరిశీలిస్తే సాంప్రదాయిక హిందూ, జైన విజ్ఞానం మీద మొగలులు ఆసక్తి కనబరిచారు. అక్బర్, జహంగీర్, షా జహాన్ పాలనా కాలంలో దాదాపు వందేళ్ల పాటు సంస్కృత పండితులకు మంచి ఆదరణ ఉండేది. ఈ పండితులే మొగల్ చక్రవర్తుల ఆస్థానాలలో అనేక ఉత్సవాలు నిర్వహించే వారు. బ్రాహ్మణులు మొగలుల ఆస్థానాల్లో జ్యోతిషులుగా ఉండే వారు. మొగల్ రాజ కుటుంబాల జాతక చక్రాలు రాశారు. రెండు మతాలకూ చెందినవారు రాజకీయ సంప్రదింపుల్లో పాల్గొనే వారు. మొగల్ చక్రవర్తుల నుంచి కానుకలూ పుచ్చుకున్నారు. అక్బర్, జహంగీర్, షా జహాన్ అనేక సంస్కృత గ్రంథాలను పర్షియన్ భాషలోకి అనువదింప చేశారు. అక్బర్ హయాంలో దాదాపు డజన్ సంస్కృత గ్రంథాలు పర్షియన్లోకి అనువాదమయ్యాయి. వీటిలో మహాభారతం, రామాయణం కూడా ఉన్నాయి. బ్రాహ్మణులు అక్బర్ కు సంస్కృతంలో సూర్యసహస్ర నామాలు అందజేస్తే సూర్యుడి బిరుదులను ఎలా ఉచ్చరించాలో మొగలులకు జైనులు నేర్పారు. మొగలులు సంస్కృత గ్రంథాల మీద చూపిన ఆసక్తి మతంతో సంబంధం లేని విషయాలకే. ఉదాహరణకు పద్మ సుందరుడు అనే ఒక జైన మేధావి సంస్కృత అలంకార శాస్త్రాన్ని అక్బర్ కు అందజేశారు. ప్రసిద్ధ సంస్కృత పండితుడు జగన్నాథ పండిత రాయలను జహంగీర్, షా జహాన్ ఆదరించారు.

ఔరంగజేబ్ అధికారంలోకి వచ్చిన తర్వాతే సంస్కృతాన్ని ఆదరించడం కొంత మేర తగ్గింది. అయితే అనేక మంది హిందువులకు భూములు ఇచ్చింది ఔరంగజేబే. ఈ భూములకు శిస్తు చెల్లించవలసిన అవసరం ఉండేది కాదు. రాజకీయంగా విభేదించిన సందర్భాలలోనే ఔరంగజేబ్ హిందూ దేవాలయాలను నాశనం చేశారు. దీనికి మతంతో నిమిత్తం లేదు, రాజకీయాలు, రాజ్య విస్తరణ కాంక్షే ప్రధానం అంటారు ట్రష్కి. ఔరంగజేబ్ అధికారం చేపట్టే నాటికి హిందీ ప్రాచుర్యంలోకి వచ్చినందువల్ల ఔరంగజేబ్ కు సంస్కృతం మీద అభిమానం మందగించింది. నిజానికి షా జహాన్ కాలం నుంచే హిందీని ఆదరించడం మొదలైంది. ఔరంగజేబ్ అధికారంలోకి వచ్చిన తర్వాత సంస్కృత పండితుడు కవీంద్రాచార్యకు రాజస్థానం నుంచి డబ్బు అందడం ఆగిపోతే ఆయన మొగల్ ప్రముఖుడైన దానిష్మండ్ ఖాన్ దగ్గర ఆశ్రయం పొందారు. ఔరంగజేబ్ పిన తండ్రి షాహిస్తా ఖాన్ పర్షియన్ మహాభారతానికి విషయ సూచిక రాసే పనిని తన దగ్గర పని చేసే హిందూ మున్షీకి అప్పగించారు. దానిష్మండ్ ఖాన్ స్వయంగా సంస్కృతంలో కవిత్వం రాసే వారు. రసకల్పద్రుమ అనే సంకలనంలో ఈ కవితలున్నాయంటారు ట్రష్కి.

ఔరంగజేబ్‌ను భయంకరుడైన పాలకుడిగా చిత్రించడంలో బ్రిటిష్ వారి పాత్రా ఉంది. మా కన్నా ముందు దండయాత్ర చేసిన వారికన్నా మేం మెరుగైన వాళ్లం అని చెప్పుకోవడానికి ప్రయత్నంలో భాగంగానే ఔరంగజేబ్‌ను దుర్మార్గుడిగా చిత్రించారు. ఔరంగజేబ్ నిష్ఠా గరిష్ఠుడైన ముస్లిం. అయినా ఇస్లాంలోని కొన్ని అంశాలను వ్యతిరేకించేవాడు. దీనికి కారణం ఆయనకున్న రాజ్యకాంక్షే.

ఆడ్రే ట్రష్కి ఔరంగజేబ్ మీద రాసిన పుస్తకం చరిత్రలోని భిన్న కోణాలను పరిశీలించడానికి, వర్తమాన పరిస్థితి ఆధారంగా గతాన్ని చూడకూడదని చెప్పడానికి ఉపకరిస్తుంది.

ఆర్వీ రామారావ్

జనజీవనం అస్తవ్యస్తం

- కొనసాగుతున్న వరదలు
- అనేక రాష్ట్రాలపై అధిక ప్రభావం
- వేలాది ఎకరాల్లో నీటమునిగిన పంటలు

న్యూఢిల్లీ: రుతుపవనాల ప్రభావం వల్ల అనేక రాష్ట్రాలలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. జనజీవనం అస్తవ్యస్తమైంది. అసోంలో వరద బీభత్సం కొనసాగుతోంది. వరదల కారణంగా ముగ్గురు మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. ముంబై నగరం దాని పరిసర ప్రాంతాల్లో గత 24 గంటల్లో భారీ వర్షాలు కురిశాయి. ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. రానున్న రోజుల్లో వర్షాల తీవ్రత అధికమయ్యే అవకాశాలున్నాయని వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో అక్కడి ప్రభుత్వం అప్రమత్తమైంది. ప్రసిద్ధ కేదార్‌నాథ్ యాత్రను తాత్కాలికంగా నిలిపివేసింది. హిమాచల్‌ప్రదేశ్‌లో ఎడతెగని వర్షాలు కురుస్తున్నాయి. గత రెండు మూడు రోజులుగా కుండపోత వర్షాలు కురుస్తుండటంతో ఆ రాష్ట్రం పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకుంది. అనేక చోట్ల రహదారులపై కొండచరియలు విరిగిపడ్డాయి. మరికొన్నిచోట్ల వరదలు పోటెత్తి రహదారులు కొట్టుకుపోయాయి. ఇంకొన్ని చోట్ల రోడ్లు పూర్తిగా నీట మునిగాయి. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 5వ నంబరు జాతీయ రహదారి సహా 20 రోడ్లలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. మండి జిల్లాలోని కటౌలాలో అత్యధికంగా 163.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆ తర్వాత వరుసగా సిన్‌హుటాలో 160 మిల్లీమీటర్లు, కసౌలీలో 145 మిల్లీమీటర్లు, కంగ్రాలో 143.5 మిల్లీమీటర్లు, హిమాచల్ రాజధాని సిమ్లాలో 99.2 మిల్లీమీటర్ల వర్షం పడింది. మరో రెండు రోజులు హిమాచల్‌లో భారీ వర్షాలు పడతాయని సిమ్లాలోని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. నేడు, రేపు రాష్ట్రంలో చాలా చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని తెలిపింది. ఈ మేరకు ఆరెంజ్ అలర్ట్ జారీచేసింది.

అసోంలో వరద బీభత్సం కొనసాగుతోంది. జనజీవనం అస్తవ్యస్తమైంది. తొమ్మిది జిల్లాల్లో నాలుగు లక్షల మందికి పైగా ప్రజలు వరదల బారిన పడ్డారు. అయితే వరద నీరు మెల్లమెల్లగా తగ్గుముఖం పడుతోందని, పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నట్లు అసోం అత్యవసర పరిస్థితి నిర్వహణ సంస్థ (ఏఎస్‌డీఎంఏ) అధికారులు తెలిపారు. అనేక బృందాలు సహాయక చర్యల్లో నిమగ్నమై ఉన్నాయి. ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. వరదల కారణంగా ముగ్గురు మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. ఏఎస్‌డీఎంఏ నివేదిక ప్రకారం, బక్సా, ఉదల్గురి, నల్బారి, లఖింపూర్, కమ్రూప్, గోల్పరా, ధుబ్రి, దర్రాంగ్, బార్పేట జిల్లాలకు చెందిన నాలుగు లక్షల మందికి పైగా ప్రజలు వరదలకు ప్రభావితులయ్యారు. ప్రజల సహాయార్థం 101 శిబిరాలు నిర్వ హిస్తున్నారు. 81 వేల మందికి పైగా ఇక్కడ ఆశ్రయం పొందారు. వరదల కారణంగా వేలాది ఎకరాల్లో పంటలు నాశనమయ్యాయి. 8,469.56 హెక్టార్ల సాగు భూమి పూర్తిగా నీట మునిగింది. కరీంగంజ్‌లోని కొన్ని ప్రాంతాల్లో వర్షం కారణంగా కొం డచరియలు విరిగిపడ్డాయి. వరద నీటి ఉధృతికి కట్టలు, రోడ్లు, వంతెనలు, ఇతర మౌలిక సదుపాయాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఏఎస్‌డీఎంఏ నివేదిక ప్రకారం 4,27,474 పెంపుడు జంతువులు కూడా వరదల వల్ల ప్రభావితమైనట్లు తెలుస్తోంది.

ముంబైలో భారీ వర్షాలు

ముంబై నగరం దాని పరిసర ప్రాంతాల్లో గత 24 గంటల్లో భారీ వర్షాలు కురిశాయి. ఫలితంగా వివిధ ప్రదేశాలలో నీరు నిలిచిపోయి కొన్ని రహదారులపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఆదివారం ఉదయం 8.30 గంటలకు ముగిసిన 24 గంటల వ్యవధిలో ముంబైలో 86 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా అదే సమయంలో శివారు ప్రాంతాల్లో 176.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. భారీ వర్షం కారణంగా నగరంలోని కొన్ని రోడ్లపై వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. మలాడ్, అంధేరి తదితర ప్రాంతాల్లో నీరు నిలిచిపోవడంతో ట్రాఫిక్ స్తంభించింది.

కేదార్‌నాథ్ యాత్ర తాత్కాలికంగా నిలిపివేత

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. రానున్న రోజుల్లో వర్షాల తీవ్రత అధికమయ్యే అవకాశాలున్నాయని వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో అక్కడి ప్రభుత్వం అప్రమత్తమైంది. ప్రసిద్ధ కేదార్‌నాథ్ యాత్రను తాత్కాలికంగా నిలిపివేసింది. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు యాత్రకు అనుమతించొద్దని ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి అదేశించారని రుద్రప్రయాగ కలెక్టర్ మయూర్ దీక్షిత్ తెలిపారు. ఇప్పటికే బయల్దేరి వెళు తున్న యాత్రికులను సోన్‌ప్రయాగ వద్ద నిలిపివేశారు. వారు తలదాచుకునేందుకు తాత్కాలిక ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. మరోవైపు రాష్ట్ర విపత్తు నిర్వహణ కేంద్రాన్ని సీఎం పుష్కర్ సింగ్ ధామి అకస్మాత్తుగా సందర్శించారు. అత్యవసర పరిస్థితులు ఏర్పడితే సన్నద్ధతపై ఆరా తీశారు. ఇవాళ ఉదయం 8 గంటల వరకు 5828 మంది యాత్రికులు సోన్‌ప్రయాగ నుంచి కేదార్‌నాథ్‌కు బయల్దేరినట్లు అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. వాళ్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. కేవలం రుద్ర ప్రయాగ, సోన్‌ప్రయాగ, కేదార్‌నాథ్ ప్రాంతాల్లోనే కాకుండా రాష్ట్రంలోని వివిధ చోట్ల భారీ వర్షాల కారణంగా వరదలు సంభవించే అవకాశముందని అధికారులు హెచ్చరిస్తున్నారు. గడిచిన 24 గంటల్లో హరిద్వార్‌లో అత్యధికంగా 78 మి.మీ వర్షం కురిసినట్లు వాతావరణశాఖ తెలిపింది. డెహ్రాడూన్‌లో 33.2 మి.మీ., ఉత్తరకాశీలో 27.7 మి.మీ మేర వర్షపాతం నమోదైంది. అధిక వర్షపాతం నమోదవుతున్న ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం ఆదేశించారు.

62 ఏళ్లలో మొదటిసారి

ఢిల్లీ, ముంబైకి ఒకేసారి నైరుతి రుతుపవనాలు

న్యూఢిల్లీ/ముంబై: రుతుపవనాల రాకతో దేశంలో వివిధ నగరాల్లో వర్షాలు మొదల య్యాయి. అయితే.. రావడం కాస్త లేట యినా రుతుపవనాలు ఈ ఏడాది ఓ విశేషాన్ని తీసుకొచ్చాయి. ఈ సారి ఢిల్లీ, ముంబైల్లో ఒకేసారి కుండపోత వర్షాలు కురిశాయి. దేశ రాజధానిని, పశ్చిమ తీరంలో ఉన్న ముంబయిని ఒకేసారి రుతుపవనాలు తాకడం గత అరవై ఏళ్లలో ఇదే ప్రథమం.ఆదివారం ఉదయం 8.30 గంటలకు దిల్లీలో 48.3మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు దిల్లీ ప్రాథమిక వాతావరణ కేంద్రమైన సఫ్దార్‌జంగ్ అబ్జర్వేటరీ వెల్లడించింది. 80 ఎంఎంల వర్షపాతాన్ని ధన్సా వాతావరణ కేంద్రం రికార్డు చేసింది. జాఫర్‌పూర్, లోడీ రోడ్‌లో 60 ఎంఎంలు, అయాన్‌నగర్, మంగేశ్ పూర్‌లో 50 ఎంఎం చొప్పున వర్షపాతం నమోదు కాగా ఎస్‌పీఎస్ మయూర్ విహార్‌లో 40ఎంఎంలు నమోదైనట్లు ఐఎండీ తెలిపింది. హరియాణా, చండీగఢ్, దిల్లీలో సాధారణం కంటే నాలుగు రెట్లు అధిక వర్షపాతం ఉన్నట్లు వెల్లడించింది. ముంబైలోని కొలాబా అబ్జర్వేటరీలో 86 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా శాంతాక్రజ్ వాతావరణ కేంద్రం... 176.1 ఎంఎంల వర్షపాతాన్ని ఆదివారం ఉదయం 8.30గంటల వరకు నమోదు చేసింది. నైరుతి రుతుపవనాలు ముంబైతో సహా మహారాష్ట్రలోని ఇతర ప్రాంతాలకు, మధ్య ప్రదేశ్, ఉత్తరప్రదేశ్, దిల్లీ, గుజరాత్, రాజస్తాన్, హరియాణా, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్, జమ్ముకశ్మీర్, లధక్‌లోకి ప్రవేశించినట్లు ఐఎండీ ప్రకటన వెల్లడిం చింది. రాగాల రెండు రోజుల్లో గుజరాత్, రాజస్తాన్, హరియాణా, పంజాబ్, జమ్ము కశ్మీర్‌లోని అనేక ప్రాంతాల్లో వర్షాలు కురవచ్చని తెలిపింది. సాధారణంగా జూన్ ఒకటో తేదీకి కేరళను రుతుపవనాలు తాకుతాయి. అలాగే జూన్ 11 నాటికి ముంబైను, జూన్ 27 నాటికి దేశ రాజధానిలోకి ప్రవేశిస్తాయి. ఈ సంవత్సరం అసాధారణ రీతిలో రుతుపవనాల విస్తరణ కొనసాగుతోంది. ఇప్పటికే ఉత్తర భారతంలోని అనేక ప్రాంతాల్లోకి రుతుపవనాలు ప్రవేశించాయి. అయితే మధ్యభారతంలోకి ప్రవేశించేందుకు రెండు వారాలు ఆలస్యమైంది. ఇక్కడి రైతులు సాగు కోసం వర్షాలపైనే ఎక్కువ ఆధారపడతారు. అయితే బిపర్జాయ్ తుపాను ప్రభావంతో రుతుపవనాల రాక ఆలస్యమైనట్లు ఐఎండీ ఇప్పటికే వెల్లడించింది.

పునర్విభజన ప్రక్రియలో సమస్యల్లేవు

అసోం సీఎం హిమంతబిస్వా శర్మ

గుహవతి: రాష్ట్రంలోని నియోజక వర్గాల పునర్విభజన ప్రక్రియలో ఎటువంటి సమస్య లేదని, గత వారం ముసాయిదా ప్రతిపాదనను ప్రచురిం చామని అసోం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ పేర్కొన్నారు. ముసాయిదా ప్రతిపాదనపై వ్యతిరేకత కేవలం ప్రక్రియను అర్థం చేసుకోని లేదా ఎన్నికల్లో ఓటమి చెందుతామని భయపడుతున్న వారి నుంచి మాత్రమే వచ్చిందని ఆయన సమర్థించుకున్నారు. 'మనది లౌకిక దేశం, ఇక్కడ ప్రతి ఒక్కరి శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని నియోజక వర్గాలు నిర్ణయించబడతాయి. నిర్దిష్ట సామాజివర్గ జనాభా సంఖ్య ఆధారంగా రిజర్వేషన్లు ఉంటాయి' అని ఆదివారంనాడిక్కడ ఒక కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లా డుతూ అన్నారు. అసోంలోని అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియలో ఎలాంటి సమస్య లేదని స్పష్టం చేస్తూ... 'రాబోయే ఎన్నికల్లో ఓటమి పాలవుతున్నామని భయపడుతున్న వారే దానికి వ్యతిరేకంగా స్వరం పెంచుతున్నారు' అన్నారు. ముసాయి దాపై రభాస్, మోరన్స్, మోటాక్స్, అహోమ్స్ వంటి వర్గాలు అసంతృప్తిగా ఉన్నాయన్న వాదనలను ఆయన తోసిపుచ్చారు. 'వాస్తవానికి వారంతా సంతోషిస్తున్నారు. నేను గిరిజన జనాభా గణనీయంగా ఉన్న లఖింపూర్, ధేమాజీ వెళ్లాను. అక్కడ నాకు ఎటువంటి వ్యతిరేకత కనిపించలేదు. ఏదైనా జరిగి ఉంటే నాకు తెలుస్తుంది కదా' అన్నారు. జనాభా ప్రాతిపదికన పునర్విభజన జరుగుతుందని, ముసాయిదాను వ్యతిరేకించే వారికి చట్టం లేదా రాజ్యాంగంపై అవగాహన లేదని ఆయన తప్పుబట్టారు. జూన్ 20న విడుదల చేసిన అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన ముసాయిదా పత్రంలో అసెంబ్లీ స్థానాల సంఖ్య 126, లోక్‌సభ నియోజక వర్గాలను 14గా ఉంచాలని ఎన్నికల సంఘం ప్రతిపాదించింది. అసెంబ్లీ, లోక్‌సభ పరిధిలోని చాలా నియోజకవర్గాల భౌగోళిక సరిహద్దులను మార్చాలని, కొన్ని స్థానాలను తొలగించి, కొన్ని కొత్త స్థానాలను సృష్టించాలని కూడా కమిషన్ యోచిస్తోంది. దీనిని రాష్ట్రంలోని ప్రతిపక్ష పార్టీలతో పాటు అధికార బీజేపీ నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వ మిత్రపక్షాలు నిరసిస్తున్నాయి. ప్రజల మనోభావాలను పట్టించుకోకుండా మతపర ప్రాతిపదికన ఓటర్లను విభజించడానికి బీజేపీ చేసిన ప్రయత్నమని ప్రతిపక్ష పార్టీలు మండి పడుతున్నాయి. దీనిపై తమ అభ్యంతరాలను ఈసీకి సమర్పించాలని నిర్ణయించాయి.

జీతాల్లో తేడాలొస్తే సమ్మె చేస్తాం

కోల్ ఇండియా ఎగ్జిక్యూటివ్‌ల హెచ్చరిక

కోల్‌కతా: కోల్ ఇండియాలో ఎగ్జిక్యూటివ్‌లు, నాన్-ఎగ్జిక్యూటివ్ ఉద్యోగుల మధ్య వేతనాలకు సంబంధించి వివాదం కొనసాగుతోంది. నాన్-ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులకు సంబంధించి కార్మిక సంఘాల అంగీకారంతో వేతన సవరణ ఒప్పందాన్ని ఆమోదించినట్లు బొగ్గు మంత్రిత్వశాఖ తెలిపింది. అయితే కొత్త ఒప్పందం ప్రకారం జీతాల్లో తేడాలొస్తాయని పేర్కొంటూ కోల్ ఇండియా చైర్మన్‌కు ఆలిండియా అసోసియేషన్ ఆఫ్ కోల్ ఎగ్జిక్యూటివ్స్ (ఏఐఏసీఈ) లేఖ రాసింది. వర్కర్ల జీతాల కంటే తక్కువగా ఉండకుండా ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులకు వ్యక్తిగత పే ప్యాకేజి ద్వారా వేతన సంరక్షణ కల్పించాలని అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఎగ్జిక్యూటివ్‌లకు వ్యక్తిగత వేతనం (పీపీ) కల్పించేందుకు తక్షణమే చర్యలు తీసుకొని సమస్యను సెప్టెంబరు 30 నాటికి పరిష్కరించాలని కోల్ ఇండియాను కోరింది. లేనిపక్షంలో సమ్మె అనివార్యమవుతుందని ఏఐఏసీఈ ప్రధాన కార్యదర్శి పీకే సింగ్ రాథోర్ తేల్చిచెప్పారు.

కేంద్రం సహకరించకున్నా

'అన్నభాగ్య' అమలు: కాంగ్రెస్

న్యూఢిల్లీ: కర్నాటకలో పేదలకు 'అన్న భాగ్య' పథకాన్ని అమలు చేయనీయకుండా కేంద్రం అడ్డుపడుతోందని కాంగ్రెస్ విమర్శించింది. అయితే కేంద్రం సహకరించకపో యినప్పటికీ పేదలకు 10 కిలోల ఉచిత బియ్యం పథకాన్ని త్వరలోనే అమలు చేస్తామని స్పష్టం చేసింది. ప్రధాని నరేంద్ర మోదీ... తమ భవిష్యత్తును కాపాడుకునేందుకు ఓటు వేసిన పేదలను శిక్షించడం కర్నాటక దురదృష్టం తప్ప మరొకటి కాదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జనవరి 1, 2023 నుండి మే 24, 2023 వరకు కర్నాటకలోని బీజేపీప్రభుత్వం బహిరంగ మార్కెట్ విక్రయ పథకం (డొమెస్టిక్) కింద క్వింటా రూ. 3,400 చొప్పున మిగతా అన్ని రాష్ట్రాలు ఉత్పత్తి చేసిన బియ్యంలో 95శాతానికి పైగా సేకరించిం దని, బహుశా మోదీజీ ఆశీర్వాదం అని రమేశ్ చెప్పారు. కర్నాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా బెదిరించినట్లుగానే ఈ 'ఆశీర్వాదం' ఆగిపోయిందని ఆయన విమర్శించారు. రాష్ట్రాలకు ఓఎంఎస్ (డి)ని నిలిపివేస్తూ జూన్ 13న కేంద్ర వినియోగ దారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఉత్తర్వు ప్రధానంగా కర్నాటకను లక్ష్యంగా చేసుకున్నదని రమేశ్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సిద్ధ రామయ్య మాట్లాడుతూ... గోడౌన్లలో బియ్యపు నిల్వలు ఉన్నాయని, ప్రైవేట్ వ్యక్తులకు కేటాయిస్తున్నారని ఆరోపించారు. తాము ఉచితంగా ఇవ్వమని కోరడం లేదని, అందుకు తగిన మొత్తం చెల్లించేం దుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఏ ఉద్దేశంతో వారు (కేంద్రం) బియ్యం ఇవ్వడానికి నిరాకరించారో అర్థం కావడం లేదన్నారు. వీరిని ఏమని అర్థం చేసుకోవాలని పేర్కొన్నారు. ఇలాంటి నాయకులు పేదల పక్షమా, వ్యతి రేకమా... అని ప్రశ్నించారు. జులై ప్రారంభం నుంచే అన్నభాగ్య పథకంలో పది కిలోల బియ్యం ఇస్తామని ప్రకటించామన్నారు. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) తొలుత సానుకూలం తెలిపినా ఆ తర్వాత వెనుక డుగు వేసిందన్నారు. ప్రత్యామ్నాయంగా బియ్యం సమ కూర్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ఛత్తీస్ ఘడ్ నుంచి 1.5 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం కొనుగోలు చేస్తామన్నారు. తెలంగాణ ప్రభుత్వం వద్దు ఇచ్చేందుకు సానుకూలం తెలిపిందన్నారు. పంజాబ్ రాష్ట్రం నవం బరులో కోటా ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఎన్‌సీసీఎఫ్, కేంద్రీయ భండార, నాఫెడ్ నుంచి కూడా కొటేషన్లు కోరామన్నారు. ఓపెన్ మార్కెట్ నుంచి కొనుగోలు చేస్తామ న్నారు. టెండర్లు పిలవాలంటే సమయం పడుతుందన్నారు. రాగులు, జొన్నలు కూడా 2కిలోల చొప్పున ఇవ్వవచ్చునని, అయినా 3 కిలోల బియ్యం అవసరం ఉందన్నారు. కాగా పాలధర పెంపుపై ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు. వర్షం రెండురోజులుగా ప్రారంభమైందని, ఎటువంటి పరిస్థితి వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. వర్షం కురవాలని దేవుడిని ప్రార్థిస్తామన్నారు. విత్తనాలు, ఎరువులు సమకూర్చామన్నారు. రాష్ట్ర పౌర ఆహార సరఫరాలశాఖ మంత్రి మునియప్ప దేవనహళ్లిలో మీడియాతో మాట్లాడుతూ కేంద్రం బియ్యం ఇచ్చేందుకు నిరాకరించిందని, కేంద్ర అనుబంధ సంస్థలతో కొనుగోళ్లకు ప్రయత్నిస్తున్నామన్నారు. ప్రత్యామ్నాయ ప్రయత్నాలు కొనసాగిస్తున్నామన్నారు.

హిందీని రుద్దడం చట్ట ఉలంఘనే!

కేంద్రం ఒప్పుకోలు

న్యూఢిల్లీ: దేశంలో ఉన్నత విద్యా సంస్థల్లో హిందీని బలవంతంగా రుద్దేందుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా నేతృత్వంలోని పార్లమెంటరీ కమిటీ చేసిన సిఫార్సు చట్టాన్ని ఉల్లంఘించడమేనని కేంద్రం అంగీకరించక తప్పలేదు. తన పరిధిలో లేని అంశంపై కమిటీ చేసిన సిఫార్సు అధికార భాషా చట్టాన్ని ఉల్లంఘించిందని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఐఐటీలు, ఐఐఎంలు, ఎయిమ్స్, కేంద్ర విశ్వవిద్యాలయాలు, కేంద్రీయ విద్యాలయాలు, నవోదయా వంటి సంస్థల్లో ప్రధాన భాషగా ఆంగ్లం స్థానంలో హిందీని ప్రవేశపెట్టాలని పార్లమెంటరీ కమిటీ సిఫార్సు చేసింది. ఈ సిఫార్సు గత ఎనిమిది మాసాలుగా రాష్ట్రపతి పరిశీలనలో వుంది. గత ఏడాది డిసెంబరులో రాజ్యసభలో వామపక్ష సభ్యుడు మాట్లాడుతూ, ఈ సిఫార్సు చట్టాన్ని ఉల్లంఘించడమా? కాదా? అని ప్రశ్నించగా ప్రభుత్వం నుంచి స్పష్టమైన సమాధానం రాలేదు. దీంతో ఆ సభ్యుడు బ్రిట్టాస్ సభాధ్యక్షులైన ఉప రాష్ట్రపతికి ఫిర్యాదు చేశారు. అనంతరం కేంద్ర హోం మంత్రిత్వ శాఖ దీనికి సమాధానం ఇచ్చింది. ఆ సిఫార్సు చట్టాన్ని ఉల్లంఘించడమేనని పేర్కొంది. హిందీని అధికార భాషగా ఉపయోగించడానికి సంబంధించి నెలకొన్న పురోగతిని అంచనా వేసి, రాష్ట్రపతికి నివేదిక అందజేయడమే కమిటీ బాధ్యత. అంతకుమించి మరే ఇతర జోక్యానికి అనుమతి లేదా అధికారమివ్వలేదు. సమాధానంలో ఈ విషయాన్ని ప్రస్తావించకుండా చట్టాన్ని ఉటంకించారు. హిందీతోపాటు ఇంగ్లీషును కూడా అధికార కార్యాచరణకు ఉపయోగించాలని అధికార భాషా చట్టం పేర్కొంటోంది. పార్లమెంట్, రాష్ట్రాల శాసనసభలు చట్టాన్ని ఆమోదించే వరకు షరతులకు కట్టుబడి వుండేందుకు కేంద్ర హోం శాఖ అంగీకరించింది. పార్లమెంటరీ కమిటీ సిఫార్సుల నివేదిక బుట్టదాఖలు చేసే అవకాశం ఉండటంతోనే కేంద్రం ఇంకా దీన్ని బహిరంగపరచలేదని పరిశీలకులు భావిస్తున్నారు.

తీవ్రవాదులను విడిపించేందుకు...

సైన్యంపైకి 1500 మంది మహిళలు

ఇంఫాల్: ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా సైన్యం అదుపులోకి తీసుకున్న అనేక మంది తీవ్రవాదులను విడిపించుకునేందుకుగానూ ఏకంగా 1500 మంది వరకు మహిళలు భద్రతా బలగాలను చుట్టుముట్టారు. దీంతో పౌరుల భద్రత దృష్ట్యా మానవతా దృక్పథంతో వారిని విడిచిపెట్టినట్లు సైన్యం ఒక ప్రకటనలో తెలిపింది. తూర్పు ఇంఫాల్‌లోని ఇథం గ్రామంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. నిఘావర్గాల సమాచారంతో గ్రామంలో సైన్యం శనివారం ఒక ఆపరేషన్ మొదలుపెట్టింది. తనిఖీల్లో భాగంగా మైతేయ్ తీవ్రవాద గ్రూప్ 'కేవైకేఎల్'కి చెందిన 12 మంది తీవ్రవాదులను అదుపులోకి తీసుకుంది. 2015లో '6 డోగ్రా యూనిట్'పై ఆకస్మిక దాడితో సహా అనేక ఘటనల్లో ఈ బృందం హస్తం ఉందని సైన్యం తెలిపింది. దీంతోపాటు పెద్దఎత్తున ఆయుధాలనూ స్వాధీనం చేసుకుంది. అయితే, ఈ విషయం తెలుసుకున్న గ్రామస్థులు భారీ సంఖ్యలో గుమిగూడారు. దాదాపు 1200 నుంచి 1500 మంది మహిళలు సైన్యాన్ని చుట్టుముట్టి అడ్డుకున్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరినా ఫలితం లేకపోయింది. ఇలా రెండు వర్గాల మధ్య రోజంతా ప్రతిష్టంభన కొనసాగింది. చివరకు సైన్యం వారిని విడిచిపెట్టింది. ఇప్పటికే రాష్ట్రంలో కొనసాగుతున్న సున్నిత పరిస్థితుల నేపథ్యంలో ప్రాణనష్టాన్ని నివారించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సైన్యం తెలిపింది.

ఇంటి వద్ద గంజాయి సాగు

ఐదుగురు వైద్య విద్యార్థుల అరెస్టు

శివమొగ్గ: కర్నాటకలో ఇంటివద్దనే గంజాయి సాగు చేసి అమ్ముతున్న ఐదుగురు వైద్య విద్యార్థులను పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో ముగ్గురు అద్దె ఇంట్లో గంజాయి సాగు చేస్తున్నట్లు తెలిపారు. విజయపుర, బళ్లారికి చెందిన ఇద్దరు వ్యక్తులను శుక్రవారం అరెస్టు చేసి వారి నుంచి రూ.20 వేల విలువైన 466 గ్రాముల గంజాయితో పాటు మరికొన్ని నిషేధిత వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఇక్కడి హాలే గురుపురాలో అద్దె ఇంట్లో ఉంటున్న నిందితులు స్థానికులకు గంజాయి విక్రయిస్తున్నారనే పక్కా సమాచారం మేరకు పోలీసులు దాడి చేయడంతో అసలు విషయం బయటపడింది. మరో ఘటనలో శనివారం ఇక్కడ శివగంగ లేఅవుట్‌లోని ఓ అద్దె ఇంట్లో పోలీసులు దాడి చేసి ముగ్గురిని పట్టుకున్నారు. తమిళనాడుకు చెందిన నిందితుల్లో ఒకరు ప్రత్యేక బల్బులను ఉపయోగించి టెంట్‌లో కృత్రిమ సూర్యకాంతిని సృష్టించి గదిలో గంజాయిని పెంచుతున్నాడు. ఇంటర్నెట్‌లో గంజాయి సాగుపై వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో విత్తనాలు కొనుగోలు చేసినట్లు తెలిసింది. వారి నుంచి సుమారు రూ.5,800 విలువైన 227 గ్రాముల ఎండు గంజాయి, రూ.30,000 విలువైన 1.53 కిలోల తాజా గంజాయి, 10 గ్రాముల చరస్, గంజాయి విత్తనాలు, గంజాయి నూనె, గంజాయి పొడి, ఎలక్ట్రానిక్ తూకం మిషన్, ఎగ్జాస్ట్ ఫ్యాన్, ఆరు టేబుల్ ఫ్యాన్లు, రెండు స్టెబిలైజర్లు, మూడు ఎల్‌ఈడీ లైట్లు, హుక్కా పైపులు, కుండలు, రూ.19,000 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ యాక్ట్ కింద కేసు నమోదు చేశామని, వారి సొంత రాష్ట్రం లేదా పట్టణాల్లో కూడా గంజాయి పంపిణీ చేస్తున్నారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డబ్ల్యూఎఫ్ఐ ఎన్నికలపై గువహటి హైకోర్టు స్టే



గువహటి: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) ఎన్నికలపై గువహటి హైకోర్టు ఆదివారం స్టే విధించింది. అసోం రెజ్లింగ్ సమాఖ్య పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం ఈ మేరకు ఉత్తర్వులు జారీచేసింది. తదుపరి విచారణను జులై 17కు వాయిదా వేసింది. వాస్తవానికి జులై 11న డబ్ల్యూఎఫ్ఐ ఎన్నికలు జరగాల్సి ఉంది. ఎలక్టోరల్ కాలేజి కోసం పేర్లు ఇచ్చేందుకు జూన్ 25 వరకు గడువును అడ్-హాక్ ప్యానల్ ఖరారు చేసింది. డబ్ల్యూఎఫ్ఐ, ఐఓఏ అడ్-హాక్ సంఘం, క్రీడా మంత్రిత్వశాఖపై అసోం రెజ్లింగ్ సమాఖ్య ఫిర్యాదు చేసింది. అర్హత ఉన్నాగానీ డబ్ల్యూఎఫ్ఐలో అనుబంధ సభ్యత్వం కల్పించలేదని, ఇందుకోసం 2014, నవంబరు 15న గోండాలో డబ్ల్యూఎఫ్ఐ జనరల్ కౌన్సిల్‌లో భాగంగా డబ్ల్యూఎఫ్ఐ ఎగ్జిక్యూటివ్ కమిటీ సిఫార్సు చేసిందని ఫిర్యాదు పేర్కొంది. తమ సంఘాన్ని డబ్ల్యూఎఫ్ఐతో అనుబంధ సంఘంగా చేసేంత వరకు ఎన్నికల కోసం తమ ప్రతినిధులను నామినేట్ చేయలేమని, అప్పటివరకు ఎన్నికల ప్రక్రియను నిలిపివేయాలని న్యాయస్థానాన్ని అసోం రెజ్లింగ్ సమాఖ్య విన్నవించింది. దీంతో తదుపరి విచారణ వరకు ఎన్నికలు నిర్వహించవద్దని డబ్ల్యూఎఫ్ఐ అడ్-హాక్ సంఘానికి, క్రీడా శాఖకు హైకోర్టు ఆదేశాలిచ్చింది. తదుపరి విచారణను జులై 17వ తేదీకి వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పెంచుకోవడమే లక్ష్యం

- వాణిజ్యం, రక్షణ తదితర రంగాల్లో కుదిరిన ఒప్పందాలు
- మోదీకి ఈజిప్టు అత్యున్నత పురస్కారం
- పురాతన మసీదును సందర్శించిన భారత ప్రధాని



కైరో:
తమ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత పెంచుకోవాలని ఈజిప్టు, భారత్ దేశాధినేతలు సంకల్పించారు. ఇందుకు సంబంధించి అనేక రంగాల్లో ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఈజిప్టు దేశాధ్యక్షుడు అబ్దెల్ ఫత్తా ఎల్ సిసి ఆహ్వానం మేరకు రెండు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత పెంచుకునేందుకు భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆ దేశంలో రెండు రోజులు పర్యటించారు. ఈ సందర్భంగా వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, భద్రత, పునరుత్పాదక ఇంధన, సంస్కృతి రంగాల్లో ఒప్పందాలు కుదుర్చుకున్నారు. భాగస్వామ్యాన్ని పెంచేందుకు ఇద్దరు అధినేతలు కట్టుబడి ఉన్నారు. ఆదివారం ఎల్ సిసితో సమావేశమైన సందర్భంగా ద్వైపాక్షిక వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందాలపై మోదీ సంతకాలు చేశారు. వ్యవసాయం, పురావస్తు, తత్వశాస్త్రం, పోటీ చట్టానికి సంబంధించి మూడు అవగాహన ఒప్పందాలతో పాటు చిన్న, మధ్య తరహా పరిశ్రమల రంగాల్లోనూ ఒప్పందాలు భారత్, ఈజిప్టు మధ్య జరిగాయి. ఈ మేరకు భారత విదేశీ వ్యవహారాల అధికార ప్రతినిధి అరిందమ్ బాగ్చీ ట్వీట్ చేశారు. ఈజిప్టులో ఎంతో ప్రతిష్ఠాత్మక అవార్డు 'ఆర్డర్ ఆఫ్ ది నైల్'తో మోదీని అబ్దెల్ ఫత్తా ఎల్ సిసి సన్మానించారు. 1915లో ప్రారంభించిన ఈ పురస్కారాన్ని మానవాళికి విశేష సేవలందించే దేశాధినేతలు, రాజులు, ఉపాధ్యక్షులకు అందిస్తుంటారు. అంతర్జాతీయ స్థాయిలో మోదీకి ఇది 13వ పురస్కారం. కైరోలోని వెయ్యేళ్ల నాటి పురాతన అల్-హకీం మసీదును ప్రధాని మోదీ సందర్శించారు. మసీదు గోడలు, తలుపులపై చెక్కిన శాసనాలను పరిశీలించారు. 11వ శతాబ్దానికి చెందిన ఈ మసీదులో ఇటీవల చేపట్టిన పునరుద్ధరణ పనులను దావూదీ బోహ్రా వర్గానికి చెందిన మతపెద్దలు మోదీకి వివరించారు. 'కైరోలోని అల్ హకీం మసీదును సందర్శించడం చరిత్రాత్మకం. ఈజిప్టు గొప్ప వారసత్వం, సంస్కృతికి ఇది చిహ్నం' అని మోదీ అనంతరం ట్వీట్ చేశారు. మొదటి ప్రపంచ యుద్ధవీరుల స్మారకమైన కైరోలోని హెలియోపోలిస్ వార్ సిమెంట్రీని సందర్శించి అమరులకు మోదీ నివాళులర్పించారు. అంతకుముందు కైరోలో ఈజిప్టు ప్రధాని ముస్తఫా మడ్‌బౌలీలో భేటీ అయ్యారు. అలాగే ఈజిప్టులోని ప్రముఖ వాణిజ్యవేత్త హసన్ అల్లంతోనూ ఫలప్రదంగా చర్చలు జరిపారు. పునరుత్పాదక ఇంధనం, గ్రీన్ హైడ్రోజన్ రంగాల్లో సహకారాన్ని పెంచుకొనేందుకు ఉన్న అవకాశాలపై ఇద్దరు చర్చించారు. ఈ మేరకు అరిందమ్ బాగ్చీ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. తొలుత కైరో విమానాశ్రయంలో దిగిన మోదీకి ఈజిప్టు ప్రధాని ముస్తఫా ఆత్మీయ స్వాగతం పలికారు. మోదీ అనంతరం సైనిక గౌరవ వందనాన్ని స్వీకరించారు. విమానాశ్రయం బయట త్రివర్ణ పతకాలు చేబూని మోదీ- మోదీ, వందేమాతరం నినాదాలతో ప్రధానికి ఈజిప్టులోని భారతీయులు స్వాగతం పలికారు. 26ఏళ్లలో భారత ప్రధాని ఈజిప్ట్‌లో పర్యటించడం ఇదే తొలిసారి.

ఎందుకు పిలవలేదో చెప్పండి!

అమిత్‌షాను డిమాండ్ చేసిన వినయ్ విశ్వం

న్యూఢిల్లీ:
మణిపూర్ అల్లర్ల నేపథ్యంలో శనివారం జరిగిన అఖిలపక్ష సమావేశానికి ఆహ్వానించనందుకు కేంద్ర ప్రభుత్వానికి సీపీఐ నిరసన తెలిపింది. అఖిలపక్ష భేటీకి తమ పార్టీని ఎందుకు ఆహ్వానించలేదని ఆ పార్టీ నిలదీసింది. తమ పార్టీని మణిపూర్ అంశంపై జరిగే అఖిలపక్ష సమావేశానికి ఎందుకు పిలవలేదో కేంద్ర హోంమంత్రి అమిత్ షా వివరణ ఇవ్వాలని సీపీఐ ఎంపీ వినయ్ విశ్వం డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి పార్టీ ప్రతినిధిగా జాతీయ కార్యవర్గ సభ్యుడు సంతోశ్ కుమార్‌ను పంపాలని పార్టీ భావించిందని తెలిపారు. తీరా తమను అఖిలపక్ష భేటీకి పిలవకపోవడం విస్మయానికి గురిచేసిందని చెప్పారు. మణిపూర్‌లో శాంతి కోసం తమ పార్టీ చేసిన కృషిని రాష్ట్ర ప్రజల నుంచి హోంమంత్రిత్వ శాఖ తెలుసుకోవచ్చని కేంద్రానికి వినయ్ విశ్వం హితవు పలికారు.

జనసేన బలం పెరిగింది: పవన్ కల్యాణ్

విశాలాంధ్ర-రాజోలు:
రాష్ట్రంలో ప్రస్తుతం జనసేన పార్టీకి బలం పెరిగిందని, ఒక్కో నియోజకవర్గంలో జనసేన తరపున పోటీకి నలుగురు ముందుకొస్తున్నారని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేపట్టిన వారాహి యాత్రలో భాగంగా ఆదివారం రాత్రి మలికిపురంలో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో పవన్ మాట్లాడుతూ 2019 ఎన్నికలలో రాష్ట్రంలో జనసేన అన్నిచోట్లా ఓడినప్పటికీ ఒక్క రాజోలులో విజయం సాధించడం తనకు ఎంతో ధైర్యాన్నిచ్చిందని తెలిపారు.

రాజోలు మీరు వెలిగించిన చిరు దీపమే వచ్చే ఎన్నికలలో రాష్ట్రంలో అఖండ జ్యోతి అవుతుందని ఆయన చెప్పారు. రాష్ట్రంలో 150 మంది ధైర్యవంతులతో జనసేన పార్టీ ప్రారంభమైందని, ప్రస్తుతం ఒక్క రాజోలులోనే పార్టీకి 10,274 మంది క్రియాశీల కార్యకర్తలు ఉన్నారన్నారు. బహిరంగ సభకు అధిక సంఖ్యలో జనం తరలిర రావడంతో మలికిపురం జనసంద్రంగా మారింది. సభ ముగిసిన తరువాత పవన్ దిండి మీదుగా పశ్చిమ గోదావరి జిల్లాకు బయలుదేరి వెళ్లారు.

షేర్ ధనంలో వీసీబీది దేశంలోనే నాలుగో స్థానం

బ్యాంకు ఛైర్మన్ చలసాని రాఘవేంద్రరావు

విశాలాంధ్ర - విశాఖ:
ది విశాఖపట్నం కోపరేటివ్ బ్యాంకు (వీసీబీ) 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.7728.43 కోట్ల వ్యాపార లక్ష్యాన్ని నిర్దేశించుకున్నది. రూ 4350.37 కోట్లు డిపాజిట్లు సేకరించాలని, రూ 3378.06 కోట్లు రుణాలు అందజేయాలని కూడా లక్ష్యంగా పెట్టుకుంది. వీసీబి 108వ మహాజన సభ ఆదివారం మద్దిలపాలెం సమీపంలోని ఒక ఫంక్షన్ హాల్లో జరిగింది. ఈ సభలో బ్యాంకు చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు 2022-23 ఆర్థిక సంవత్సర వార్షిక నివేదికను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022-23 ఆర్థిక సంవత్సరానికి బ్యాంకు డిపాజిట్లు రు 3929 కోట్లు, రుణాలు, రు 3052 కోట్లు, వ్యాపారం రు 7026 కోట్లకు చేరుకున్నాయని వివరించారు. బ్యాంకు సభ్యులు 92,831 మంది కాగా షేర్ ధనం రూ 305 కోట్లుగా నమోదు అయ్యిందన్నారు. షేర్ ధనంలో వీసీబీ దేశంలోనే నాలుగో స్థానాన్ని పొందిందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సభ్యులు సంఖ్య లక్షకు, షేర్ ధనం రూ.350 కోట్లకు చేరుకోవాలని ఆకాంక్షించారు. గత ఆర్థిక సంవత్సరం 2022-23లో రూ 73.14 కోట్ల లాభాలు అర్జించినట్లు పేర్కొన్నారు. బ్యాంకు రిజర్వ్ నిధులు రూ.389 కోట్లు కాగా ఆస్తులు రూ 179 కోట్లని వివరించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సెక్యూరిటీలు, ఇతర బ్యాంకులలో పెట్టుబడులు రూ.1620 కోట్లుగా నమోదు అయిందన్నారు. ఈ సమావేశంలో బ్యాంక్ అభివృద్ధి లక్ష్యాలు, నూతన సభ్యులను చేర్పించడం, షేరుధనం, మెడిక్లెయిం, నిరర్థక ఆస్తుల వసూళ్లు తదితర అంశాలపై తీర్మానాలు ప్రవేశపెట్టి ఆమోదించారు. ఈ సమావేశంలో బ్యాంకు ఎమరిటస్ ఛైర్మన్ మానం ఆంజనేయులు, సీనియర్ వైస్ ఛైర్మన్ జి.భాస్కరరావు, బ్యాంకు డైరెక్టర్లు ఎస్. నాగభూషణ చౌదరి, ఏజే స్టాలిన్, ఎన్. కామరాజు, కే. భవాని, వి. చంద్రశేఖర్, జి. జనార్ధనరావు, సి.హెచ్. ఆదినారాయణ శాస్త్రి, ఎస్. జానకి రామచంద్రరావు, పీవీ రమణారావు, కె . ప్రసాదరావు, యు. పార్వతీదేవి, జేవీ సత్యనారాయణ మూర్తి, సీహెచ్ కోటేశ్వరరావు, పి.నారాయణ స్వామి, పి. కృష్ణ మోహన్ రావు, ఎ. రామకృష్ణారావు, కో-ఆప్టెడ్ డైరెక్టర్ డి. బాబురావు, కో -ఆప్టెడ్ డైరెక్టర్ ఆర్. వైద్యనాథన్, బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణాధికారి పీవీ నరసింహమూర్తి, బ్యాంకు జనరల్ మేనేజర్ ఏవీ రామకృష్ణారావు, పాల్గొన్నారు. ఈ సభలో బ్యాంకు 50 బ్రాంచ్‌ల సంప్రదింపుల కమిటీ సభ్యులు, బ్యాంకు జోనల్ మేనేజర్లు, మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సహకార బ్యాంకులపై ఆర్‌బీఐ నిరంకుశ వైఖరి

వీసీబీ ఎమిరిటస్ ఛైర్మన్ మానం ఆంజనేయులు

సహకార బ్యాంకుల పట్ల రిజర్వు బ్యాంకు అనుసరిస్తున్న నిరంకుశ, అసంబద్ధ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ న్యాయపోరాటం చేయాల్సిన అవసరం ఉందని బ్యాంకు ఎమిరిటస్ ఛైర్మన్ మానం ఆంజనేయులు అన్నారు. సహకార రంగంలో సంస్కరణల కోసం ఏర్పాటు చేసిన విశ్వనాథన్ కమిటీ సిఫార్సులు జాయింట్ పార్లమెంటరీ కమిటీ పరిశీలన తరువాత ప్రస్తుతం చట్టం చేసే దశలో ఉందని తెలిపారు. బ్యాంకు ప్రయోజనాలకు ప్రాధాన్యతనిస్తూ పాలకవర్గం ఆలోచనలు చేయాలన్నారు.

మాటల్లో చెప్పలేను..

కమల్‌హాసన్‌తో ప్రాజెక్ట్ కే స్క్రీన్ షేరింగ్‌పై ప్రభాస్

హైదరాబాద్:
ప్రభాస్ నటిస్తోన్న క్రేజీ ప్రాజెక్టుల్లో ఒకటి ప్రాజెక్ట్ కే. నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్నాడు. సైన్స్ ఫిక్షన్ జోనర్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొనే, దిశా పటానీ, ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తుండగా.. అమితాబ్ బచ్చన్ కీలక పాత్ర పోషిస్తు న్నారు. కమల్‌హాసన్ కూడా ఇందులో వన్ ఆఫ్ ది కీ రోల్ చేస్తున్నాడు. దశాబ్దాలుగా ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కమల్‌తో కలిసి నటించడం పట్ల చాలా చాలా ఎక్జయిటింగ్‌కు లోనవుతున్నాడు ప్రభాస్. కమల్‌హాసన్‌కు సంబంధించిన ఓ స్పెషల్ వీడియో రిలీజ్ చేస్తూ.. తన సంతోషాన్ని అందరితో పంచుకున్నాడు ప్రభాస్. నా హృదయంలో శాశ్వతంగా నిలిచిపోయే క్షణం. ప్రాజెక్ట్ కే. లెజెండరీ యాక్టర్ కమల్‌హాసన్‌తో కలిసి పనిచేసినందుకు మాటల్లో చెప్పలేనంత గౌరవంగా భావిస్తున్నా. కల నిజమైన వేళ.. టైటాన్ ఆఫ్ సినిమాతో కలిసి నేర్చుకునే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని తన ఎక్జయిట్‌మెంట్‌ను అందరితో పంచుకున్నాడు ప్రభాస్. ఈ చిత్రాన్ని 2024 జనవరి 12న విడుదల చేయబోతున్నట్టు మేకర్స్ ఇప్పటికే ప్రకటించింది.

రాజమౌళి ప్రాజెక్ట్ మొదలయ్యేది అప్పుడే?

హైదరాబాద్: మహేష్-రాజమౌళి సినిమా కోసం అభిమానులతో పాటు యావత్ ఇండియా మొత్తం అమితాసక్తితో ఎదురు చూస్తుంది. ఇప్పటికే రాజమౌళి స్టోరీ లైన్ చెప్పి సినీ అభిమానుల్లో తిరుగులేని అంచనాలు నెలకొల్పారు. పైగా పాన్ వరల్డ్ రేంజ్ సినిమా అంటూ సోషల్ మీడియా హైప్‌తోనే మహేష్ అభిమానుల హార్ట్ బీట్ రెండు రెట్లు ఎక్కువగా కొట్టుకుంటుంది. ఇక ఇవన్నీ వింటుంటే సగటు సినీ ప్రేక్షకుడు సైతం ఎప్పుడెప్పుడు ఈ సినిమా మొదలవుతుందా? అని ఎదురు చూస్తున్నాడు. కొన్ని నెలలుగా ఈ సినిమా స్క్రిప్ట్ పనులు జరుగుతున్నాయి. రాజమౌళి తండ్రి విజేయేంద్ర ప్రసాద్ కనీవినీ ఎరుగని రీతిలో కథను సిద్ధం చేస్తున్నాడట. ఈ సినిమాలో మహేష్ ప్రపంచాన్ని చుట్టే మనిషిగా కనిపిస్తాడని రాజమౌళి ఎప్పుడు క్లారిటీ ఇచ్చేశాడు. ఇదిలా ఉంటే తాజాగా ఈ సినిమాకు సంబంధించిన బిగ్ అప్‌డేట్ ఒకటి నెట్టింట తెగ వైరల్ అవుతుంది. ఈ సినిమా లాంఛింగ్ కార్యక్రమాలు మహేష్ బర్త్‌డే సందర్భంగా అగస్టు 9న గ్రాండ్‌గా జరుపనున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే దాని కోసం ప్లాన్లు కూడా వేస్తున్నట్లు తెలుస్తుంది. ఇక నవంబర్‌లో ఎట్టి పరిస్థితుల్లో సినిమా షూటింగ్‌ను మొదలు పెట్టే ఆలోచనలో ఉన్నారట.

గుండెపోటుతో కుల్జీత్ పాల్ కన్నుమూత



ముంబై:
బాలీవుడ్‌కు చెందిన అలనాటి సినీ నిర్మాత కుల్జీత్ పాల్ (90) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శనివారం రాత్రి గుండెపోటు రావడంతో ముంబైలోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. పాల్ మేనేజర్ సంజయ్ బాజ్‌పాయ్ ఇవాళ (ఆదివారం) ఉదయం మీడియాకు ఈ విషయాన్ని వెల్లడించారు. ఆదివారం మధ్యాహ్నం నగరంలోని శాంటాక్రజ్ ఏరియాలోని శ్మశాన వాటికలో ఆయనకు అంత్యక్రియలు నిర్వహించారు. కుల్జీత్ పాల్ అర్థ్, ఆజ్, పరమాత్మ, వాస్న, దో శికారీ, అషియానా లాంటి పలు చిత్రాలను నిర్మించారు. బాలీవుడ్‌లో ప్రముఖ నటిగా ఎదిగిన రేఖకు దో శికారీ సినిమా ద్వారా కుల్జీత్ పాల్ మంచి బ్రేక్ ఇచ్చారు. ఆ తర్వాత ఆమె ఇండస్ట్రీలో ఇక వెనుదిరిగి చూడలేదు.

రెండు వంతుల నోట్లు వచ్చేశాయ్

- రూ.2వేల నోట్ల ఉపసంహరణపై ఆర్బీఐ
- ద్రవ్యోల్బణాన్ని నిర్దేశిత లక్ష్యానికి చేరుస్తాం: శక్తికాంత దాస్

ముంబై:
చెలామణిలో ఉన్న రూ.2వేల నోట్ల ఉపసంహరణను ప్రకటించిన నెలలో మూడింట రెండు వంతుల నోట్లు బ్యాంకింగ్ వ్యవస్థకు తిరిగొచ్చాయని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ తెలిపారు. రూ.2వేల నోట్లను వెనక్కి తీసుకుంటామని భారత రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) మే 19న ప్రకటించింది. సెప్టెంబరు 30లోగా నోట్ల మార్పిడి, బ్యాంకు డిపాజిట్లకు అవకాశమిచ్చింది. దీంతో చెలామణిలో ఉన్న రూ.2000 నోట్లలో మూడింట రెండు వంతులకుపైగా (అంటే చెలామణి నోట్ల విలువ రూ.3.62లక్షల కోట్లలో నుంచి రూ.2.41లక్షల కోట్లు విలువ చేసే నోట్లు) తిరిగొచ్చాయని ఇటీవల పీటీఐకిచ్చిన ఇంటర్వ్యూలో శక్తికాంత దాస్ తెలిపారు. సుమారు 85శాతం డిపాజిట్ల రూపంలో తిరిగి రాగా మిగతా నోట్లను వినియోగ దారులు మార్చుకున్నారని చెప్పారు. రూ.2వేల నోట్లను ఉపసంహరించుకోవడం ద్వారా ద్రవ్య సుస్థిరత ప్రభావితం కాబోదన్నారు. ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం ఉండదన్నారు. ద్రవ్యోల్బణాన్ని నిర్దేశిత లక్ష్యమైన నాలుగు శాతానికి చేర్చేలా ఆర్బీఐ కసరత్తు చేస్తోందని, ఈ క్రమంలో ఎల్ నినో సవాల్‌గా ఉందని అన్నారు. ఆర్బీఐ అంచనా వేసినట్లు 2024 ఆర్థిక సంవత్సరంలో ఆర్థికవృద్ధి 6.5శాతానికి పెరుగుతుందని విశ్వాసంగా చెప్పలేకపోయారు. గతేడాది ఏప్రిల్‌లో 7.8శాతంగా ఉన్న ద్రవ్యోల్బణాన్ని మేలో 4.25శాతానికి చేర్చగలిగినట్లు దాస్ వెల్లడించారు. ద్రవ్యోల్బణాన్ని గమనిస్తుంటామని, '24 ఆర్థిక సంవత్సరంలో 5.1శాతం ద్రవ్యోల్బణాన్ని అంచనా వేశామన్నారు. నిర్దేశిత నాలుగు శాతానికి చేర్చేందుకు కసరత్తు కొనసాగిస్తామన్నారు. అధిక రుణవ్యయం గురించి మాట్లాడుతూ వడ్డీ రేట్లు నేరుగా ద్రవ్యోల్బణంతో ముడిపడి ఉంటాయని, వినియోగ ధర ద్రవ్యోల్బణం నాలుగు శాతానికి చేరుకుంటే వడ్డీ రేట్లను ఆర్బీఐ తగ్గించగలదని దాస్ చెప్పారు. రష్యా, ఉక్రెయిన్ యుద్ధం వల్ల నిత్యావసరాల ధరలు పెరిగిపోయాయని అన్నారు. ఆహార ద్రవ్యోల్బణం తగ్గిందని, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా గోదుమ, ధన్యం నిల్వలను విడుదల చేయడంతో పాటు కొన్ని ఉత్పత్తులపై సుంకాల్లో నిర్దేశిత కోతలు కలిసివచ్చినట్లు తెలిపారు. జియో-పొలిటిక్స్, వర్షాలు, అంతర్జాతీయ పరిణామాలతో ద్రవ్యోల్బణం ప్రభావితమవుతుందని చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 6.5శాతం జీడీపీని ఆర్బీఐ ఆశిస్తోందన్నారు. బ్యాంకు రుణవృద్ధి 16శాతం వద్ద ఉందన్నారు. కార్పొరేట్ల నుంచి రుణ డిమాండ్ ఎక్కువని, ప్రాజెక్ట్ లోన్లు కూడా ఎక్కువేనని చెప్పారు. 2023లో రూపాయి బలపడిందని, వొలటిలిటీ తగ్గింపునకు ఆర్బీఐ చర్యలు తీసుకుంటున్నట్లు దాస్ తెలిపారు. అమెరికా ఫెడ్ ధరలు పెరిగినా రూపాయిపై ప్రభావం ఉండదని ఆయన అన్నారు. ప్రస్తుత ఖాతా లోటు (సీఏడీ) చేయిదాటిపోయే స్థితి లేదన్నారు. ఎగుమతులు పెరగడం, ముడిచమురు ధర తగ్గడం సానుకూలంగా పరిణమిస్తున్నట్లు శక్తికాంత దాస్ వెల్లడించారు.

నేటి నుంచి ఏపీలో వివిధ రైళ్ల రద్దు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:
విజయవాడ, గుంటూరు డివిజన్ల పరిధిలో మౌలిక సదుపాయాల కోసం జరుగుతున్న నిర్మాణ పనుల కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో తిరిగే రైళ్లతోపాటు రాష్ట్రం మీదుగా ప్రయాణించే వివిధ రైళ్లను దక్షిణ మధ్య రైల్వే రద్దు చేసింది. మరికొన్నింటిని దారి మళ్లించింది. ఈనెల 26వ తేదీ నుంచి జులై 2వ తేదీ వరకు రద్దైన రైళ్లలో నడికుడి-కాచిగూడ(07792), కాచిగూడ-నడికుడి(07791) మచిలీపట్నం-గుడివాడ(07869), గుడివాడ-మచిలీపట్నం(07868) విజయవాడ-విశాఖపట్నం(22702), విశాఖపట్నం-విజయవాడ (22701), విశాఖపట్నం-గుంటూరు(17240), గుంటూరు-విశాఖ పట్నం (17239), విశాఖపట్నం-కాకినాడ పోర్ట్(17268), కాకినాడ పోర్ట్-విశాఖపట్నం (17267), విశాఖపట్నం-రాజమండ్రి(07467), రాజమండ్రి-విశాఖపట్నం(07466) బిట్రగుంట-విజయవాడ(07977), విజయవాడ-బిట్రగుంట(07978), చెన్నై సెంట్రల్-బిట్రగుంట (17238), బిట్రగుంట-చెన్నై సెంట్రల్(17237), విజయవాడ-గుంటూరు(07783), గుంటూరు-విజయ వాడ(07788) గుంటూరు-మాచర్ల(07779), మాచర్ల-గుంటూరు (07780) మాచర్ల-నడికూడి(07580), నడికూడి-మాచర్ల(07579) తెనాలి-రెపల్లె (07875), రెపల్లె-తెనాలి(07876) నర్సాపూర్-గుంటూరు(17282), గుంటూరు-నర్సాపూర్(17281), గుంటూరు-డోన్(17228) ఉన్నాయి. అలాగే, రేపల్లె-మార్కాపురం(07889), మార్కాపురం-తెనాలి (07890) రైళ్లను గుంటూరు-మార్కాపురం, మార్కాపురం-గుంటూరు మధ్య 26వ తేదీ నుంచి జులై 2వ తేదీ వరకు పాక్షికంగా రద్దు చేశారు. హుబ్లీ-విజయవాడ(17329) రైలును నంద్యాల-విజయవాడ మధ్య ఈనెల 26వ తేదీ నుంచి 4వ తేదీ వరకు, విజయవాడ-హుబ్లీ(17330) రైలును విజయవాడ-నంద్యాల మధ్య ఈనెల 27 నుంచి జులై 5వ తేదీ వరకు పాక్షికంగా రద్దుచేశారు. డోన్-గుంటూరు(17227) రైలును ఈనెల 27వ తేదీ నుంచి జులై 3 వరకు, గుంటూరు-కాచిగూడ(17251), కాచిగూడ-గుంటూరు(17252) రైళ్లను ఈనెల 28 నుంచి జులై 6వ తేదీ వరకు రద్దు చేశారు.

వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యల్ని పరిష్కరించాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్):
గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏపీఎన్జీవో అధ్యక్షుడు బండి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అదివారం విజయవాడ ఏపీఎన్జీవో కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కా రానికి ఏపీఎన్జీవో సంఘం అండగా ఉంటుందన్నారు. శానిటేషన్ విభాగంలో పనిచేసే కార్యదర్శులకు ఉద్యోగులకు సాధారణ ఉద్యోగుల్లా పనివేళలు కల్పించాలని, గ్రామ వార్డు సచివాలయ సిబ్బందికి సర్వీసు రూల్స్ ను వెంటనే రూపొందించాలని ఆయన అన్నారు. గ్రామ వార్డు సచివాలయ సిబ్బందిపై రాజకీయ పరంగా ఒత్తిళ్లు ఉన్నాయని వీటిని నివారించాలన్నారు. ప్రత్యేక అతిథిగా విచ్చేసిన ప్రభుత్వ సలహాదారు చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుం దన్నారు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అన్ని ప్రయోజనాలను వర్తింప జేస్తామన్నారు. ఇందుకోసం తన వంతుగా కృషి చేస్తానన్నారు. గ్రామ వార్డు సచివాలయం ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు ఎండీ జానీ పాషా మాట్లాడుతూ శానిటేషన్ సెక్రటరీల పనివేళల్ని సవరించాలన్నారు. గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులకు గ్రేడ్ -1 పంచాయతీ కార్యదర్శి తో సమానంగా అధికారాలు ఇవ్వాలని కోరారు. ఎడ్యుకేషన్ కార్యదర్శులకు పదోన్నతులు కల్పించాలన్నారు. ఉద్యోగులకు ప్రొబెషన్ పిరియడ్ లో ఇవ్వాల్సిన బకాయిలను చెల్లించాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల ఆవిర్భవించి నాలుగేళ్లయిన సందర్భంగా జగనన్నకు వందనం పేరిట అక్టోబర్ 2న ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరపాలని నిర్ణయించినట్లు తెలిపారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ వార్డు సచివాలయం ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడిగా ఎండీ జానీ పాషా, కార్యదర్శిగా పుట్టి రత్నం, ఉపాధ్యక్షులుగా యస్.హరి, కె.రామకృష్ణారెడ్డి, జి.హరీంద్ర, పి.జె.గణేష్ కుమార్, కోశాధికారిగా బి.పుల్లారావు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా యస్.కె.మహబూబ్ సుబాని, టి.కోటేశ్వరరావు, కార్యదర్శులుగా ఎం.శాంతి సాగర్, డి.సురేష్‌బాబు, కె.విజయ్ మోహన్, బి.శ్వేత, సంయుక్త కార్యద ర్శులుగా పి.స్వామియేలు, టి.తిరుమ లయ్య, పి.హనుమేష్, కె.మురళీకృష్ణ, ప్రచారకార్యదర్శులుగా ఎం.ధనశేఖర్, ఆర్.జాన్ ఫ్రుడెంట్, కార్యనిర్వాహక సభ్యులుగా టి.దీక్షిత్, ఎం. కోటేశ్వరరావు ఎన్నికయ్యారు. ఈ కార్యక్ర మంలో ఏపీ ఎన్జీవో సంఘం నేతలు శివారెడ్డి, ఏ విద్యాసాగర్, సచివాలయ ఉద్యోగుల సంఘాల నేతలు, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.